ప్రజాశక్తి

శనివారం 22 నవంబర్ 2025

8 పేజీలు





విశాఖపట్నం అనకాపల్లి

అదాని సిమెంట్‌పై గరం గరం



సమస్యలను ఆలకిస్తున్న మేయర్ పీలా

- రద్దు కోసం జివిఎంసి కౌన్సిల్‌లో సభ్యుల పట్టు
- పిపిపి విధానంలో రోడ్ల అభివృద్ధిపై తీవ్ర అభ్యంతరాలు
- స్థానిక సమస్యలపై చర్చ
- మొత్తంగా 131 అంశాలకు ఆమోదం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి సర్వసభ్య సమావేశం శుక్రవారం నగర మేయర్ పీలా శ్రీనివాసరావు అధ్యక్షతన వాడీవేడిగా జరిగింది. పెదగంట్యాడలో ఏర్పాటు చేయనున్న అదాని అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీని రద్దు చేయాలంటూ పలువురు కార్పొరేటర్లు ఆందోళనకు దిగారు. విశాఖ ఉక్కు కార్మికులపై చంద్రబాబు వ్యాఖ్యల పట్ల ప్రతిపక్ష కార్పొరేటర్లు నిరసన తెలిపారు. ఈ సమావేశంలో మొత్తం 132 అంశాలకుగాను టేబుల్ అజెండాలోని 27వ అంశం ఒకటి మినహా 131 అంశాలకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. జివిఎంసి ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో 90 అంశాలు కలిగిన ప్రధాన అజెండాతో పాటు 42 అంశాలతో కూడిన టేబుల్ అజెండాపై చర్చించారు. సమావేశంలో కమిషనర్ కేతన్ గార్గ్‌తో పాటు కౌన్సిల్ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అంబుజా సిమెంట్‌పై దద్దరిల్లిన సభ

సభ ప్రారంభంకాగానే సభ్యుల అభ్యర్థన మేరకు మేయర్ జీరో అవర్‌ను ప్రకటించారు. ఈ క్రమంలో అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీని రద్దు చేయాలని సభ్యులు



సమస్యలపై నిలదీస్తున్న సిపిఎం కార్పొరేటర్ గంగారావు

తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజా ప్రయోజనాలను, పర్యావరణాన్ని దృష్టిలో ఉంచుకొని ఆ ఫ్యాక్టరీ నిర్మాణాన్ని రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, పర్యావరణ సంస్థలను కోరుతూ కౌన్సిల్ సభ్యులు నినదించారు. సిపిఎం 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు అంశంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. జనసేన పార్టీకి చెందిన డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరాజు సైతం సిమెంట్ ఫ్యాక్టరీకి తాను వ్యతిరేకమని సభాముఖంగా ప్రకటించారు.

జీరో అవర్‌లో ప్రధాన సమస్యలు

జీరో అవర్‌లో పలువురు కార్పొరేటర్లు తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను మేయర్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రధానంగా వీధి లైట్ల సమస్యలు, గంగవరం ప్రాంతంలో చేపల మార్కెట్ ఏర్పాటు, మధురవాడ సమీపంలో టిడిఆర్‌లు ఇవ్వకుండానే రోడ్ల నిర్మాణం చేపట్టడం వంటి అంశాలపై చర్చించారు. టౌన్ ప్లానింగ్ విభాగంలో రద్దు చేసిన చైన్ మెన్ విధానం ఇంకా కొనసాగుతుండటంపై కార్పొరేటర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. సింహాచలం ప్రాంతంలో పారిశుధ్య కార్మికుల సంఖ్యను పెంచాలని, 12వ వార్డులో క్రిస్టియన్ బరియల్ గ్రౌండ్‌ను ఏర్పాటు చేయాలని పలువురు సభ్యులు కోరారు. 16వ వార్డులో మంచినీటి సమస్య అధికంగా ఉందని, యుజిడి పనులు సగంలోనే నిలిపివేశారని, అదే విధంగా కెఆర్ఎం కాలనీ పార్కు ప్రాంతంలో వీధిలైట్ల సమస్య అధికంగా ఉందని ఆ ప్రాంత కార్పొరేటర్ తెలిపారు.

పిపిపిపై తీవ్ర అభ్యంతరాలు

భోజన విరామం అనంతరం ప్రధాన అజెండాపై చర్చ జరిగింది. జోన్ 2, 3, 4, 5, 6లలో మొత్తం మిగతా 2లో..



మాట్లాడుతున్న రఘురామ కృష్ణరాజు

పారదర్శకంగా భూముల రీ సర్వే

శాసన సభాపక్ష ఫిర్యాదుల కమిటీ చైర్మన్ రఘురామ కృష్ణరాజు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పదేపదే తలెత్తుతున్న భూ సంబంధిత సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా సమగ్ర ప్రణాళికతో కూడిన కార్యాచరణ రూపొందించాలని, క్షేత్రస్థాయి పరిస్థితులకు అనుగుణంగా ఆచరణలో పెట్టి అమలు చేయాలని సర్వే అండ్ ల్యాండ్ రికార్డులు, రెవెన్యూ శాఖ అధికారులను రాష్ట్ర శాసన సభాపక్ష ఫిర్యాదుల కమిటీ చైర్మన్, డిప్యూటీ స్పీకర్ కె.రఘురామకృష్ణరాజు ఆదేశించారు. కమిటీ సభ్యులు కొణతాల రామకృష్ణ, పల్లా శ్రీనివాసరావు, పి.విష్ణుకుమార్ రాజులతో కలిసి శుక్రవారం విశాఖ జిల్లాలో పర్యటించిన ఆయన కలెక్టరేట్ మీటింగ్ హాలులో అధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. సమగ్ర భూ రీసర్వే, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, రికార్డుల నిర్వహణ, సరిహద్దుల గుర్తింపు, అభ్యంతరాల స్వీకరణ, సమస్యల పరిష్కారంలో కలెక్టర్, జెసి, ఆర్‌డిఒ, తహశీల్దార్ల పాత్ర, ప్రభుత్వ, ప్రయివేటు మిగతా 2లో..

కిడ్నీ వ్యాధులపై సమగ్ర అధ్యయనం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: శ్రీకాకుళం జిల్లాలో తీర ప్రాంత మండలాల్లో కిడ్నీ వ్యాధులపై సమగ్ర అధ్యయనం ప్రారంభించామని కిడ్నీ వ్యాధుల పరిశోధన ప్రాజెక్టు మెంటర్, ప్రముఖ నెఫ్రాలజిస్ట్, డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ మాజీ విసి, రిటైర్డ్ డైరెక్టర్ అఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ టి.రవిరాజు తెలిపారు. శుక్రవారం ఆంధ్ర వైద్య కళాశాల డాక్టర్ అంబేద్కర్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లా ఉద్దానం ప్రాంతంలో 18 శాతం జనాభా కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్నట్లు తమ పరిశోధనలో వెల్లడైందని మిగతా 2లో..

చిన్నారి గుండె శస్త్ర చికిత్సకు స్పీకర్ సాయం

వార్త 8లో..

23 నుంచి కళాభారతిలో సంగీత సభలు

వార్త 2లో..

26న జిల్లా కేంద్రాల్లో రైతు సంఘాల నిరసనలు

వార్త 8లో..

పారా స్విమ్మింగ్ విజేతలకు అభినందన

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: ఈ నెల 15 నుంచి 18 వరకూ హైదరాబాద్ బాలయోగి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన 25వ జాతీయ పారా స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో విజేతలైన విశాఖపట్నం పారా స్విమ్మింగ్ క్రీడాకారులను జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ అభినందించారు. హైదరాబాద్ వేదికగా జరిగిన ఈ చాంపియన్‌షిప్‌లో విశాఖపట్నం జిల్లాకు చెందిన క్రీడాకారులు వలసనైని రవి (100 మీటర్లు) ఫ్రీ స్టైల్‌లో స్వర్ణ పతకం, 50 మీటర్లు బ్యాక్ స్ట్రోక్‌లో రజతం, కౌశర్ సాహిల్ షేక్ 50 మీటర్లు బ్యాక్ స్ట్రోక్‌లో (స్వర్ణ పతకం) ,50 మీటర్లు ఫ్రీ స్టైల్‌లో స్వర్ణం, 100 మీటర్లు ఫ్రీ స్టైల్‌లో రజత పతకం, ఆదారి ప్రణీత్ 50 మీటర్లు బ్యాక్ స్ట్రోక్‌లో స్వర్ణం, 100 మీటర్లు బ్యాక్ స్ట్రోక్‌లో స్వర్ణం, 100లో కాంస్యం, నిధి బైపోతు మిగతా 2లో..



నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు

కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్‌ను ఉపసంహరించుకోవాలి

వార్త మెయిన్‌లో..

మొదటి పేజీ తరువాయి..

అదాని సిమెంట్‌పై గరం గరం

88.35 కిలోమీటర్ల రహదారులను పిపిపి విధానంలో హైబ్రిడ్ యాన్యుటీ మోడల్‌గా అభివృద్ధి చేసే అంశంపై తీవ్ర చర్చ జరిగింది. సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు పిపిపిని తీవ్రంగా వ్యతిరేకించారు. అదేవిధంగా ఎండాడ ప్రాంతంలో కేటాయించిన భూమికి బదులుగా ముడసర్లోవ వద్ద మరొక ప్రాంతాన్ని కేటాయించేందుకు కోరిన అలినేషన్‌ను సభ్యులు వ్యతిరేకించినప్పటికీ అది ఆమోదం పొందింది. ఎన్ఎడి ప్రాంతంలో తృప్తి క్యాంటీన్ ఏర్పాటుపై అభ్యంతరాలు వచ్చాయి. బీచ్ రోడ్డులోని తృప్తి క్యాంటీన్ దళారుల చేతుల్లోకి వెళ్లిందని, అక్రమాలు జరుగుతున్నాయని జనసేన సభ్యులు కౌన్సిల్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై విచారించి చర్యలు చేపట్టాలని మేయర్ కమిషనర్‌ను ఆదేశించారు.

రెల్లి వీధి పేరు మార్పు తిరస్కరణ

టేబుల్ అజెండాలోని 27వ అంశంలో భాగంగా 36వ వార్డు కార్పొరేటర్ మేరీ జోన్స్ ప్రతిపాదన మేరకు రెల్లి వీధి పేరును శ్రీ శబరి నగర్‌గా మార్చాలని కోరగా ఆ ప్రాంత వాసులు ఇతర సభ్యుల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. సుదీర్ఘ చర్చ అనంతరం, ఆ ప్రాంతం చరిత్ర దృష్ట్యా పేరు మార్పు సరికాదని మేయర్ ఈ అంశాన్ని తిరస్కరించారు.

స్థానిక సమస్యలపై గళం విప్పిన గంగారావు

జివిఎంసి కౌన్సిల్ సమావేశం ప్రారంభం కాగానే సిపిఎం ఫ్లోర్ లీడర్, 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు పెదగంట్యాడ ప్రాంతంలో పతిపాదిత అదానీ సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు అంశంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. నాలుగు మిలియన్ టన్నుల సామర్థ్యంతో ఏర్పాటు చేయనున్న ఈ ఫ్యాక్టరీకి రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసిందన్నారు. ఈ క్రమంలో గతంలో జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో గాజువాక, పెదగంట్యాడ ప్రాంతాలకు చెందిన వేల మంది ప్రజలు ఈ ప్రాజెక్టును వ్యతిరేకించారని గంగారావు గుర్తు చేశారు. ఇప్పటికే అదాని పోర్టు ద్వారా కాలుష్యం పెరిగి ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, కొత్త సిమెంట్ ఫ్యాక్టరీ వస్తే వారు కేన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల బారిన పడతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అంశాన్ని కౌన్సిల్ అజెండాలో చేర్చాలని నెలన్నర క్రితమే వినతిపత్రాలు ఇచ్చినా చేర్చకపోవడంపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ సభలో ఆందోళనకు దిగారు. ఈ అంశంపై వైసిపి, సిపిఐ సహా కౌన్సిల్‌లోని అన్ని పార్టీలు మద్దతు తెలుపుతూ తీవ్ర ఆందోళనకు దిగాయి. అదే విధంగా విశాఖ నగర ప్రజల నీటి సరఫరా కోసం ఉద్దేశించిన విస్కో నుంచి ఆర్సెలార్ మిట్టల్ కంపెనీకి 40 శాతం నీటిని మళ్లిస్తే నగరంలో తాగునీటి సమస్య తలెత్తే ప్రమాదముందని గంగారావు ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని మేయర్‌ను కోరారు.

పారదర్శకంగా భూముల రీ సర్వే

భూముల వర్గీకరణ, సర్వే ప్రక్రియలో తలెత్తుతున్న సమస్యలు, రిజిస్ట్రేషన్ల ప్రక్రియ తదితర అంశాలపై సుదీర్ఘంగా సమీక్షించారు. సర్వే, రెవెన్యూ చట్టాల్లో తీసుకురావాల్సిన సవరణలు, జిఒలపైనా చర్చించారు. ఈ సందర్భంగా రఘురామకృష్ణరాజు మాట్లాడుతూ రెవెన్యూ రికార్డుల ప్రక్షాళనలో భాగంగా చేపడుతున్న సమగ్ర భూ రీసర్వే ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని, లోపాలు తలెత్తకుండా, గందరగోళం ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. రీ సర్వే చేయనున్న గ్రామాల్లో ముందుగా ఏయే పనులు చేయాలో తెలియజేశారు. రైతుల సమక్షంలోనే ప్రక్రియ మొత్తం సాగాలని, అభ్యంతరాల స్వీకరణకు వీలుగా మొబైల్ మెజిస్ట్రేట్ బృందాలు ప్రజలకు అందుబాటులో ఉండాలని అన్నారు. సమావేశంలో భాగంగా రీసర్వేకు సంబంధించిన వివరాలను సర్వే అండ్ ల్యాండ్ రికార్డుల విభాగం డైరెక్టర్ ఆర్.కూర్మనాథ్ కమిటీకి వివరించారు.

పారా స్విమ్మింగ్ విజేతలకు అభినందన

100 మీటర్లు బ్యాక్ స్ట్రోక్‌లో స్వర్ణం, 50 మీటర్లు ఫ్రీ స్టైల్‌లో రజతం, సాలపు పూర్ణ చంద్రరావు 100 మీటర్లు ఫ్రీ స్టైల్‌లో కాంస్య పతకం, 50 మీటర్లు ఫ్రీ స్టైల్లో కాంస్య పతకం, ఎం.సాయి నిఖిల్ గౌతమ్ 100 మీటర్లు బ్రెస్ట్ స్ట్రోక్‌లో కాంస్య పతకాలు, కావ్య 50 ఫ్రీ స్టైల్‌లో స్వర్ణం సాధించారు. క్రీడాకారులను కలెక్టర్ తన ఛాంబర్ నందు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో విశాఖపట్నం జిల్లా వికలాంగుల విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ కవిత, విశాఖపట్నం జిల్లా పారా స్పోర్ట్స్ గౌరవ అధ్యక్షులు శీతల్ మదన్, పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సెక్రటరీ వి.రామస్వామి, అసోసియేషన్ సభ్యురాలు లక్ష్మీ, క్రీడాకారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధులపై సమగ్ర అధ్యయనం

ఈ నేపథ్యంలోనే ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ కిడ్నీ వ్యాధులపై పరిశోధనలకు అనుమతి ఇచ్చిందని మూడేళ్లలో ఈ ప్రాజెక్టు పూర్తి అవుతుందని పేర్కొన్నారు. ఇందుకు రూ. 6.01 కోట్లు కేటాయించినట్లు వివరించారు.ఉద్దానం ప్రాంతంలోని ఇచ్ఛాపురం కవిటి, కంచిలి, మందస, పలాస, వజ్రపుకొత్తూరు మండలాల్లో అధ్యయనం జరుగుతుందని చెప్పారు. ఈ నెల 1 నుండి ఈ ప్రక్రియ లాంఛనంగా మొదలయిందని వివరించారు. ఆర్ఎన్ఎ సీక్వెన్సింగ్ విధానంలో జన్యుపరమైన పరీక్షలు కూడా ఈ పరిశోధనలో భాగంగా చేస్తామని తెలిపారు. సమావేశంలో కెజిహెచ్ కిడ్నీ వ్యాధుల విభాగాధిపతి డాక్టర్ జి. ప్రసాద్,ఆంధ్ర వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యారాణి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కష్ణవేణి పాల్గొన్నారు.

23 నుంచి కళాభారతిలో సంగీత సభలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఈ నెల 23 నుంచి 29 తేదీ వరకు కళాభారతిలో సంగీత సభలు నిర్వహించనున్నారు. విశాఖ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. సంస్థ యువకళాకారుల్ని ప్రోత్సహిస్తున్న విషయం తెలిసిందే. ఈ సంగీత సభల్లో లబ్ధప్రతిష్ఠులైన సంగీతజ్ఞులు తమ విద్యను ప్రదర్శించనున్నారని విశాఖ మ్యూజిక్ అకాడమీ కార్యదర్శి సి.ఎ చంద్రశేఖర్ వీరఘంట మీడియాకు తెలిపారు.

24న సుబ్రహ్మణ్యానికి సంగీత కళా సాగర పురస్కారం

ఈ అకాడమీ ఏటా సమర్పించే ప్రతిష్ఠాత్మక 'సంగీత కళాసాగర' పురస్కారాన్ని ఈ సారి చెన్నైకి చెందిన ప్రఖ్యాత వాయులీన విద్వాంసులు వివి సుబ్రహ్మణ్యంకు అందజేయనున్నామన్నారు.ఈ నెల 24 న నిర్వహించే ప్రత్యేక సభలో ఆయన ఈ అవార్డు ప్రదానం ఉంటుందన్నారు. వేడుకల్ని నోవస్ కనస్ట్రక్షన్స్, క్రెడాయ్ విశాఖ చాప్టర్ చైర్మన్ ధర్మేందర్ వరద ఈ నెల 23 న సాయంత్రం 6.15గంటలకు ప్రారంభించనున్నట్టు తెలిపారు.

దత్తత అవగాహనా సదస్సు ఏర్పాట్లపై సమీక్ష

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాష్ట్రంలో దత్తత ప్రక్రియపై అవగాహన పెంచడానికి, రాబోయే 'నేషనల్ అడాప్షన్ అవేర్నెస్ కాంక్లేవ్' కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపై ముందస్తు సమీక్షా సమావేశం శుక్రవారం ఉదయం విఎంఆర్‌డిఎ సమావేశ మందిరంలో నిర్వహించారు. సెంట్రల్ రిసోర్స్ అడాప్షన్ అథారిటీ సిఇఒ భావన సక్సేనా, ఆంధ్రప్రదేశ్ మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ వేణుగోపాల్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. సమావేశంలో భావన సక్సేనా మాట్లాడుతూ దేశం మొత్తం మీద దత్తత ప్రక్రియపై అవగాహనా కార్యక్రమాలను ముమ్మరం చేయాలని, ముఖ్యంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియలు ఎక్కువ జరిగేటట్లు చూడాలని సూచించారు. వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతు రాష్ట్రంలో దత్తతల పురోగతిపై సమగ్రంగా సమీక్షించారు. విశాఖపట్నంలోని హోటల్ నోవాటెల్‌లో ఈ నెల 27న జరగనున్న 'కాంక్లేవ్ - 2025' విజయవంతానికి అందరూ కృషి చేయాలన్నారు.

12వ రోజుకు టిట్టిభ సత్యాగ్రహం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్: తెలుగు భాష రక్షణ కోసం చేపట్టిన టిట్టిభ సత్యాగ్రహం శుక్రవారం నాటికి 12వరోజు చేరింది. పలువురు భాషాభిమానులు మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా తెలుగుదండు అధ్యక్షుడు పరవస్తు సూరి మాట్లాడుతూ,తెలుగు జాతి తరపున, తెలుగు భాష రక్షణ కోసం చేపట్టిన ఈ ప్రజాఉద్యమాన్ని నిరవధికంగా కొనసాగిస్తామని, అంతవరకూ భాషా పోరాటం ఆగదని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ కొచ్చెర్లకోట, తిరుపతి ప్రసాదవర్మ, చేబియ్యం రవిమోహన్, పరమేశ్వరరావు, అనూషా,అల్లు వెంకటరమణ,తిరుపతి రాజమన్నార్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాధికారానికి ఐక్య పోరాటం అనివార్యం

ప్రజాశక్తి -భీమునిపట్నం : రాజ్యాధికారం రావాలంటే ఐక్యంగా పోరాడడం తప్పదని పలువురు వక్తలు స్పష్టం చేశారు. జివిఎంసి 4వ వార్డు చేపలుప్పాడ, చొక్కావానిపాలెంలో ఉత్తరాంధ్ర మత్స్యకారుల అభివృద్ధి సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మత్స్యకార దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎయు విశ్రాంత ప్రొఫెసర్ సూరప్పడు హాజరై మాట్లాడుతూ, రాష్ట్ర జనాభాలో నామ మాత్రం ప్రజలు కలిగిన ఒకటి, రెండు సామాజిక తరగతుల వారు రాజ్యాధికారం అనుభవిస్తున్నారని, ఇందుకు మిగిలిన మెజారిటీ సామాజిక తరగతుల్లో రాజకీయ చైతన్యం కొరవడడమే కారణమని పేర్కొన్నారు. రాజ్యాధికారాన్ని వారసత్వంగా అనుభవిస్తున్నారని తెలిపారు. జరుగుబాటు కోసమైనా తిరుగుబాటు చేయాలని పిలుపునిచ్చారు. మత్స్యకార నాయకులు కారి అప్పారావు అధ్యక్షతన జరిగిన ఈ సభలో వార్డు కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు, సంఘం అధ్యక్షులు చొక్కా భాస్కరరావు, కోశాధికారి కర్రి ఎర్రయ్య, మత్స్యకార నాయకులు పేర్ల విజయచందర్, గంటా నూకరాజు, చీపుళ్ళ శ్రీనివాస్, జివిఎంసి 4వ వార్డు అధ్యక్షులు పాసి నరసింగరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం పేద మహిళలకు చీరలు, మత్స్యకారులకు దుప్పట్లు పంపిణీ చేశారు.

చేపల తిమ్మాపురంలో...

జివిఎంసి 4వ వార్డు పరిధి చేపల తిమ్మాపురంలో ది విశాఖపట్నం టౌన్ ఫిషర్ ఉమెన్ డ్రై ఫిష్ కో-ఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో మత్స్యకార దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ పి.లక్ష్మణరావు హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో భీమిలి, ఫిషింగ్ హార్బర్ ఎఫ్‌డిఒలు ఆశాజ్యోతి, ఆర్.ఈశ్వరరాజు, సొసైటీ అధ్యక్షులు మారుపిల్లి పార్వతమ్మ, మత్స్యకార నాయకులు మారుపిల్లి అమర్‌నాథ్, ఎపి మెకనైజ్డ్ బోట్ అసోసియేషన్ అధ్యక్షులు మైలపల్లి లక్ష్మణరావు, ప్రధాన కార్యదర్శి పిసి అప్పారావు, సంప్రదాయ మత్స్యకార నాయకులు తెడ్డు శంకర్ తదితరులు పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న మత్స్యకార నాయకులు

నేరాలు ఘోరాలు

వైన్ షాపు, సెల్‌ఫోన్ దుకాణంలో చోరీ

ప్రజాశక్తి-ఆనందపురం : ఆనందపురం సర్కిల్ జంక్షన్‌లో శుక్రవారం అర్ధరాత్రి 1 గంట సమయంలో అమరావతి వైన్స్ షాపులోకి ఓ ఆగంతకుడు చొరబడ్డాడు. నిఘా కెమెరాలను గుడ్డలతో కప్పేసి పట్టుబడకుండా జాగ్రత్తపడ్డాడు. అమరావతి వైన్ షాపులో రూ.64 వేలు, కొన్ని మద్యం బాటిళ్లు అపహరించినట్టు యజమాని తెలిపారు. ఆ పక్కనే ఉన్న శ్రీ వెంకటేశ్వర సెల్‌ఫోన్ దుకాణంలో పలు మొబైల్ ఫోన్లను దొంగిలించాడు. తర్వాత శివ సెల్ షాప్ లో చొరబడటానికి ప్రయత్నించాడు. స్థానిక క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

గంజాయి కారు బీభత్సం

ప్రజాశక్తి -చోడవరం : పోలీసులను తప్పించుకునే ప్రయత్నంలో చోడవరం అటవీశాఖ కార్యాలయం వద్ద మెయిన్ రోడ్‌లో ఒక కారు కొట్టి బీభత్సం సృష్టించింది. విశాఖ ఏజెన్సీ నుండి ఎపి31 బి ఎ9022 నెంబర్ కారులో గంజాయి తరలిస్తున్నట్టు పోలీసులకు సమాచారం రావడంతో కొత్తూరు జంక్షన్ వద్ద ఆపి ప్రయత్నం చేశారు. అయితే కార్ డ్రైవర్ వేగంగా నడుపుతూ ఒక ఆటోను స్కూటీపై వెళ్తున్న భార్యభర్తలను ఢీ కొట్టి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని కారు ఢీ కొట్టింది. కారు బీభత్సానికి గురైన వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కారులో నుండి డ్రైవర్ పారిపోవడానికి ప్రయత్నిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. 250 కేజీలగంజాయి కారులో ఉన్నట్లు తెలుస్తోంది. పోలీసులు కేసు నమోదు చేశారు. గంజాయి తరలిస్తున్న వారిని అదుపులోకి తీసుకున్నారు

అదృశ్యమైన బాలుని ఆచూకీ లభ్యం

ప్రజాశక్తి - కశింకోట : బాలుడు మిస్సింగ్ కేసును 48 గంటల్లోనే స్థానిక పోలీసులు చేధించారు. తప్పిపోయిన బాలుడిని గుర్తించి, సురక్షితంగా కుటుంబ సభ్యుల చెంతకు చేర్చారు. శుక్రవారం సిఐ అల్లు స్వామి నాయుడు చెప్పిన వివరాలివి. కశింకోటలోని డిపిఎన్ హైస్కూల్‌లో చదువుకుంటూ, బిసి హాస్టల్‌లో ఉంటున్న యజల్ల నరేంద్ర (15) రెండు రోజుల క్రితం వాచ్‌మెన్‌కు సమాచారం ఇవ్వకుండా హాస్టల్ నుండి బయటికి వెళ్లాడు, తిరిగొచ్చినపుడు గమనించిన వాచ్‌మెన్, నీ తండ్రికి చెబుతానని అనడంతో భయపడిన నరేంద్ర హాస్టల్‌ను విడిచి బయటకు వెళ్లిపోయాడు. భీమవరం బస్ స్టాండ్‌లో నరేంద్రను కనిపించాడని అందిన సమాచారంతో హాస్టల్ వార్డెన్, వాచ్‌మెన్, హెడ్ కానిస్టేబుల్ భీమవరానికి వెళ్ళి, అక్కడి సీసీటీవీ ఫుటేజ్‌లను పరిశీలించారు. నడుచుకుంటూ నీలకంఠపురం చేరినట్టు నిర్ధారణ కావడంతో సిఐకు సమాచారమిచ్చారు. సిఐ అల్లు స్వామినాయుడు, ఎస్ఐ కె.లక్ష్మణరావు, పి మనోజ్ కుమార్, హెడ్ కానిస్టేబుల్ మధు, కానిస్టేబుల్స్ రాజశేఖర్, గోపి మూడు బృందాలుగా ఏర్పడి గాలింపు చేపట్టి నరేంద్రను పట్టుకుని వారి తల్లిదండ్రులకు అప్పగించారు.

వాలంటీర్ టీచర్లకు శిక్షణ

ప్రజాశక్తి-ఆనందపురం : ఆనందపురం మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం "అక్షర ఆంధ్ర" కార్యక్రమంలో భాగంగా వాలంటీర్ టీచర్లకు శిక్షణ ఇచ్చారు. 225 మంది వాలంటీర్ టీచర్లు హాజరయ్యారు. గ్రామాల్లో అక్షరాస్యత పెంపుదల లక్ష్యంగా తీసుకున్న ఈ కార్యక్రమంలో ప్రతి వాలంటీర్ టీచర్ తమ గ్రామంలోని 10 మంది చదువులేని పెద్దలకు 100 రోజుల పాటు రోజూ ఒక గంట చొప్పున చదువు నేర్పాల్సి ఉంటుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎండిఒ, అడల్ట్ ఎడ్యుకేషన్ విభాగం ఎడి చిన్నికృష్ణ, డిఆర్‌డిఎ హెచ్‌డి ఎపిఎం వెంకటలక్ష్మి, ఎండిఒ కార్యాలయం ఎఒ, ఎపిఎం ఎస్తేరు రాణి పాల్గొని వాలంటీర్ టీచర్లను అభినందించారు.

కార్పొరేటర్లను కలిసిన టిడిపి నూతన కమిటీ

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి 3వ వార్డు టిడిపి నూతన కమిటీ అధ్యక్షులుగా నియమితులైన గొలగాని నరేంద్రకుమార్, ప్రధాన కార్యదర్శి కనకల అప్పలనాయుడు తదితరులు 2,3 వార్డుల కార్పొరేటర్లు గాడు చిన్ని కుమారిలక్ష్మి, గంటా అప్పలకొండ తదితరులను శుక్రవారం భీమిలిలో మర్యాదపూర్వకంగా కలిసి సహాయ సహకారాలు అందించాలని కోరారు. గంటా నూకరాజు కూడా కలిశారు.

దంత వైద్యంలో నూతన ప్రమాణాలు

ప్రజాశక్తి -మధురవాడ : నోటి ఆరోగ్యం ప్రాధాన్యతపై ప్రజలలో అవగాహన పెరుగుతోందని, మారుతున్న జీవన విధానం, ఆహారపు అలవాట్లు దంత సంరక్షణకు ప్రాధాన్యతను పెంచుతున్నాయని గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చి (జిమ్సర్) ప్రో-వైస్ ఛాన్సలర్ డాక్టర్ బి.గీతాంజలి పేర్కొన్నారు. గీతం దంత వైద్య కళాశాల, ఆసుపత్రిలో దంత వైద్య విద్యను అభ్యసించడానికి 2025-26 విద్యాసంవత్సరానికి ప్రవేశం పొందిన నూతన విద్యార్థుల "వైట్‌కోట్ ధారణ" కార్యక్రమంలో శుక్రవారం నిర్వహించారు. గీతాంజలి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ, నోటి ఆరోగ్యానికి గుండె జబ్బులు, మానసిక ఒత్తిడులకు, మధుమేహం, జీర్ణవ్యవస్థ సమస్యలకు సంబంధం ఉంటుందని పరిశోధనలలో వెల్లడైందని తెలిపారు. దంత వైద్యులుగా ఎదగాలనుకునే యువత సంబంధిత పరిశోధనలపై దృష్టి సారించాలని సూచించారు. భిన్నంగా ఆలోచించే కొత్తతరం దంతవైద్యుల ద్వారా దంతవైద్యానికి ఆదరణ పెరుగుతుందని పేర్కొన్నారు. గీతం దంత వైద్య కళాశాల, ఆసుపత్రి ప్రిన్సిపల్ డాక్టర్ వి.వి.నరసింహారావు మాట్లాడుతూ, వైద్య వృత్తిలోకి ప్రవేశించే వారు నిరంతర విద్యార్థిగా ఉండాలని, విలువలకు ప్రాధాన్యత ఇవ్వాలని, రోగుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని చెప్పారు. డాక్టర్ రాజామూర్తి మాట్లాడుతూ, వైద్య విద్యార్థులు తెల్లకోటు ప్రాధాన్యతను అర్థం చేసుకొని విలువలతో వృత్తిలో ఎదగాలన్నారు. వైట్‌కోట్ ధారణలో భాగంగా నూతనంగా ప్రవేశం పొందిన దంత వైద్య విద్యార్థులకు విభాగాధిపతుల ద్వారా తెల్లకోటును అందజేశారు. కార్యక్రమంలో గీతం దంత కళాశాల అనాటమి విభాగాధిపతి డాక్టర్ పద్మిని, ఫిజియాలజి విభాగాధిపతి డాక్టర్ స్వరూప్ చాంద్, బయోకెమిస్ట్రీ విభాగాధిపతి డాక్టర్ కళ్యాణ్, వైద్యులు డాక్టర్ మనీష్‌కుమార్, డాక్టర్ సాహితి, డాక్టర్ శృతి, డాక్టర్ రవితేజ పాల్గొన్నారు.

శ్మశాన రహదారి నిర్మాణం అడ్డగింతపై ఫిర్యాదు

ప్రజాశక్తి- పద్మనాభం : మండలంలోని బుడ్డివలస గ్రామపంచాయతీ పరిధిలో శ్మశానానికి పోవడానికి రోడ్డు నిర్మాణాన్ని గ్రామానికి చెందిన మండల రమణ, మండల అప్పలనారాయణ అడ్డగించడంతో గ్రామస్తులు పద్మనాభం తహశీల్దార్ ఆనందరావుకు ఫిర్యాదు చేశారు. మూడు రోజులైనా స్పందన రాకపోవడంతో గ్రామస్తులు సుమారు 100 మంది శుక్రవారం పద్మనాభం తహశీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. గ్రామస్తులందరికీ అవసరమైన రోడ్డు సౌకర్యాన్ని ఇద్దరు వ్యక్తులు వల్ల నిలుపుదల అవుతుందని, దాన్ని పరిష్కరించాలని గ్రామస్తులు కోరారు గ్రామంలో ఉన్న సిసి రోడ్డు నుండి 660 అడుగులు పొడవు గల రోడ్డులో సుమారు పదిమంది రైతులు ఉన్నారని, ఎనిమిది మంది స్వచ్ఛందంగా రోడ్డుకు అనుమతించారని, ఇద్దరు అడ్డుకోవడంతో ఆగిపోయిందని, అధికారులే పరిష్కారం చూపాలని కోరారు.

యువతకు ఉపాధి అవకాశాలు

ప్రజాశక్తి -తగరపువలస : నిరుద్యోగ యువతకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మెరుగైన ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నాయని విశాఖపట్నం జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ఆదిశేషు తెలిపారు. తగరపువలసలో ఎంఎస్ఎంఇ చాంబర్ ఆఫ్ కామర్స్ ఉత్తరాంధ్ర రీజనల్ కార్యాలయం శుక్రవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆదిశేషు మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళి, అవగాహన కల్పించి వారిని పారిశ్రామికవేత్తలుగా తీర్చి దిద్దడంలో చాంబర్ ఆఫ్ కామర్స్ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. చిట్టివలస బ్రాంచ్ చీఫ్ మేనేజర్ శ్రీనివాస్ మాట్లాడుతూ, మంచి ఆర్థిక చరిత్ర కలిగిన వారికి అన్ని బ్యాంకులు రుణాలు మంజూరు చేయడానికి ముందుకు వస్తాయన్నారు. ఎంఎస్ఎంఇ సిసి చైర్మన్ దాసరి దేవరాజు మాట్లాడుతూ, ఆటో కార్మికులకు కేంద్ర ప్రభుత్వం ద్వారా ఎలక్ట్రికల్ ఆటోలను సబ్సిడీతో కూడుకున్న రుణాలను మంజూరు చేయించడానికి కావలసిన డాక్యుమెంటేషన్ చేయిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఐజిప్ ఎలక్ట్రికల్ ఆటో మ్యానుఫ్యాక్చరర్స్ ప్రతినిధి సత్య, ఉత్తరాంధ్ర కోఆర్డినేటర్ జామి అప్పలరాజులు పాల్గొన్నారు.

'అవంతి'లో నేడు ఫ్రెషర్స్ డే

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక అవంతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్‌లో ఫ్రెషర్స్ డే వేడుకలు శనివారం నిర్వహిస్తున్నామని ప్రిన్సిపల్ కె.నాగపూర్ణశ్రీ చెప్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా ముత్తంశెట్టి శ్రీనివాసరావు, కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, ఆంధ్ర విశ్వవిద్యాలయ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డాక్టర్ జి.గిరిజాశంకర్, ఎసిపి ఎస్.అప్పలరాజు, అవంతి గ్రూప్ జనరల్ సెక్రటరీ ఎం.ప్రియాంక తదితరులు పాల్గొంటారని తెలిపారు. కొత్తగా ప్రవేశించిన విద్యార్థులను స్వాగతిస్తూ సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.

ఉప్పాడ లక్ష్మణరావుకు సన్మానం

ప్రజాశక్తి- ఆనందపురం : ఆనందపురం మండలం వెల్లంకి గ్రామపంచాయతీ సర్పంచ్ ఉప్పాడ లక్ష్మణరావును శుక్రవారం వెల్లంకిలో అధికారులు సన్మానించారు. నిత్యం ప్రజల్లోనే ఉంటూ వారి సమస్యల పట్ల, గ్రామ పరిశుభ్రత కోసం అతను తీసుకుంటున్న చర్యలు మిగతా వారికి ఆదర్శంగా నిలుస్తాయని ఎంపిడిఒ డాక్టర్ వి.జానకి కొనియాడారు. ఇదే స్ఫూర్తితో మిగతా పంచాయతీలు కూడా పనిచేయాలన్నారు. సన్మాన గ్రహీత ఉప్పాడ లక్ష్మణరావు మాట్లాడుతూ, ఈ సన్మానం ద్వారా తనపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. తనను గుర్తించినందుకు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సిఇఒ నారాయణమూర్తి, ఎంఐఆర్‌డి ప్రతినిధి కె.నాగరాజు, మండల పరిషత్ ఉప అభివృద్ధి అధికారి బి.సత్యనారాయణ, గ్రామ కార్యదర్శి శ్రీరామమూర్తి, ఉప సర్పంచ్ కంచరావు శ్రీనివాసరావు, ఎఇ మూర్తి, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు ప్రసాదరావు పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎడి కార్మికుల నిరసన

ప్రజాశక్తి -గోపాలపట్నం : ఎన్ఎడి కార్మికులపై నిర్బంధకాండకు వ్యతిరేకంగానూ, 36 మంది కార్మికుల అక్రమ సస్పెన్షన్లకు ఏడాది ఆయిన సందర్భంగా శుక్రవారం ఎన్ఎడి సిఇ యూనియన్ ఆధ్వర్యాన సంస్థ ప్రధాన ద్వారం వద్ద 7.30 నుంచి 8 గంటల వరకు నల్ల బ్యాడ్జీలు ధరించి బ్లాక్ డే నిర్వహించారు. సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు సత్యాగ్రహ దీక్షా శిబిరం వద్ద కాగడాల ప్రదర్శన జరిపారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి రుత్తల శ్రీనివాస్ మాట్లాడుతూ, ఎన్ఎడి యాజమాన్యం వ్యవహరిస్తున్న తీరు వల్ల కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కష్టపడి పనిచేస్తున్న కార్మికులకు స్టోరేజ్ ఓటి పేమెంట్ను వెంటనే వేయాలని, అక్రమ సస్పెన్షన్లను రద్దుచేసి సంబంధిత కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, 2024 నవంబర్ నుంచి ఫైర్ ఫైటింగ్ కార్మికులకు రావలసిన ఓటి పేమెంటును వెంటనే చెల్లించాలని, 2024 జూన్లో ఎబిఎఎస్ పేరుతో కార్మికులకు చేసిన ఇఎల్ల పేమెంట్ను వెంటనే చెల్లించాలని, అక్రమ పద్ధతిలో చేయిస్తున్న షిఫ్ట్ డ్యూటీలను వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షులు ఎవి.థామస్, అధ్యక్షులు పి.నూకరాజు, వర్క్స్ కమిటీ సభ్యులు, కో-ఆపరేటివ్ డైరెక్టర్లు, క్యాంటీన్ కమిటీ సభ్యులు, యూనియన్ కార్యకర్తలు పాల్గొన్నారు.



బ్లాక్ డే పాటిస్తున్న ఎన్ఎడి కార్మికులు

అవసరం మేరకే యాంటీ బయాటిక్స్

ప్రజాశక్తి-సీతమ్మధార : యాంటీ బయాటిక్స్ను డాక్టర్ల ప్రిస్క్రిప్షన్ మేరకే వాడాలని డిఎం అండ్ హెచ్ఒ డాక్టర్ జగదీశ్వరరావు సూచించారు. యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ సందర్భంగా చేపట్టిన ర్యాలీని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈనెల 18వ తేదీ నుండి 24వ తేదీ వరకు యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ అవగాహన వారోత్సవాలు ఆరోగ్య కేంద్రాల వద్ద నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వీటి ముఖ్య ఉద్దేశం యాంటీ బయోటిక్స్ను అనవసరంగా వాడటం వల్ల డ్రగ్ రెసిస్టెన్స్ పెరుగుతుందన్నారు. యాంటీ బయోటిక్స్ ఏది అవసరం అనేది డాక్టర్లు, సిహెచ్ఒఎస్, ఫార్మసిస్ట్, పారా మెడికల్ సిబ్బంది సలహాల మేరకే వాడాలని చెప్పారు. ఈ ర్యాలీలో డాక్టర్ బాలాజీ, హెల్త్ వెల్నెస్ సెంటర్ల నోడల్ అధికారి డాక్టర్ జగదీష్ప్రసాద్, ఐడిఎస్పి బి.నాగేశ్వరరావు, డాక్టర్ బి.హారిక పాల్గొన్నారు.

అనుమతులు లేని నిర్మాణం కూల్చివేత

ప్రజాశక్తి-సీతమ్మధార : అనుమతులు లేకుండా నిర్మిస్తున్న అదనపు అంతస్తును జివిఎంసి అధికారులు శుక్రవారం కూల్చేశారు. గ్రీవెన్స్లో వచ్చిన ఫిర్యాదు మేరకు జివిఎంసి 25వ వార్డు పరిధిలో బిల్డర్ శ్రీనివాసరావు జివిఎంసి అనుమతి లేకుండా నిర్మిస్తున్న అదనపు అంతస్తును మూడవజోన్ సహాయ సిటీ ప్లానర్ మధుసూదనరావు ఆదేశాల మేరకు సంస్థ పట్టణ ప్రణాళిక విభాగం సిబ్బంది కూల్చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'ఉత్తరం' వైసిపి బిసి సెల్ అధ్యక్షునిగా హరి


ప్రజాశక్తి-సీతమ్మధార : విశాఖ ఉత్తర నియోజకవర్గం వైసిపి బిసి సెల్ అధ్యక్షునిగా నియమితులైన పోతిబంతి హరిని పార్టీ జిల్లా అధ్యక్షులు కెకె.రాజు శుక్రవారం సత్కరించారు. ఈ సందర్భంగా కెకె.రాజు మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ పార్టీ బలోపేతానికి కృషిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో భోగవల్లి గోవింద్, కొమ్ము నాగు, అప్పలరాజు, సూరిబాబు, సత్యందుర్గ, గోపాల్, సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాణాల జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 44 వార్డు కార్పొరేటర్ బాణాల శ్రీనివాస్ క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ఆయన పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి వైసిపి జిల్లా అధ్యక్షులు కెకె.రాజు హాజరై పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అభిమానులు, కార్యకర్తలు హాజరై బాణాలకు శుభాకాంక్షలు తెలిపారు. తన పుట్టినరోజు వేడుకలకు విచ్చేసిన ప్రతి ఒక్కరికీ బాణాల శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.

పారిశుద్ధ్య కార్మికులకు యూనిఫాం పంపిణీ

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 25వ వార్డు టిడిపి కార్పొరేటర్ కార్యాలయంలో శానిటేషన్ ఇన్స్పెక్టర్ సన్యాసినాయుడి ఆధ్వర్యాన జివిఎంసి స్టాండింగ్ కమిటీ మెంబర్ సారిపిల్లి గోవింద్ ద్వారా పారిశుద్ధ్య కార్మికులకు యూనిఫాం పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.


కమలాజనార్ధనరావు దంపతులను సన్మానిస్తున్న వైసిపి నాయకులు

కణితి ఆలయాన్ని సందర్శించిన కమలాజనార్ధన్

ప్రజాశక్తి -గాజువాక : శ్రీకూర్మం ఆలయం మాజీ డైరెక్టర్ పూడి కమలాజనార్ధనరావు దంపతులు కణితి శివాలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆమెను సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి 87వ వార్డు అధ్యక్షులు బొడ్డ గోవింద్, ఆలయ కమిటీ ప్రతినిధులు ప్రగడ శ్రీనివాసరావు, బొడ్డ సన్యాసిరావు, ప్రగడ శంకరరావు, బొడ్డ సూరిబాబు పాల్గొన్నారు.

ఎయును సందర్శించిన ఆదర్శ్ విద్యార్థులు

ప్రజాశక్తి-పెందుర్తి: ఆంధ్రా యూనివర్సిటీలోని అమెరికన్ కార్నర్ను ఆదర్శ్ కళాశాల విద్యార్థులు 80 మంది శుక్రవారం సందర్శించారు. ఎయు గ్రంథాలయంలో ఉన్న రీసెర్చ్ సెక్షన్, వేదాలు, భారత రాజ్యాంగం, అమెరికన్ కార్నర్లో విదేశాలలో ఉన్నత చదువులు, ఉద్యోగాలు తదితరాలను విద్యార్థులు తెలుసుకున్నారని లైబ్రేరియన్ నాగరాజు తెలిపారు. విద్యార్థులు ఆంధ్ర యూనివర్సిటీని సందర్శించడం వల్ల విజ్ఞానానికి సంబంధించిన విషయాలు నేర్చుకున్నారని పేర్కొన్నారు.

300 మంది రక్తదానం

ప్రజాశక్తి- మాధవధార : జాతీయ సహకార వారోత్సవాల సందర్భంగా ఇండియన్ నేవీ సివిల్ ఎంప్లాయీస్ కో-ఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యాన మేఘాద్రిపేట కాలనీలోని కళామేగా ఆడిటోరియంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. సొసైటీ సభ్యులు, వారి కుటుంబ సభ్యులు సుమారు 300 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నేవల్ డాక్యార్డు ప్రిన్సిపల్ మెడికల్ ఆఫీసర్ సర్జికల్ కెప్టెన్ కౌస్తవ చటర్జీ హాజరై మాట్లాడారు. అన్ని దానాల కంటే రక్తదానం గొప్పదని, నేడు రక్తదానం చేసిన ప్రతి ఒక్కరూ హీరోలేనని చెప్పారు. సామాజిక బాధ్యతతో భాగంగా 33 సంవత్సరాలుగా రక్తదాన శిబిరాలు నిర్వహించడం గొప్ప విషయం అన్నారు. రక్తం లేక చనిపోయిన మనుషులు లేకుండా చూడాలని పిలుపునిచ్చారు. గౌరవ అతిథి రెడ్డి వెంకటరావు మాట్లాడుతూ, ఒక రక్త దాత ముగ్గురికి ప్రాణదాత అవుతారని తెలిపారు. రక్తంతో పాటు ప్లేట్లెట్స్, ప్లాస్మా లాంటి పదార్థాలు మానవ శరీరం నుండి తప్ప మరి ఎక్కడా దొరకవన్నారు. సామాజిక బాధ్యతలు నిర్వహిస్తున్న సొసైటీ సభ్యులను, పాలకవర్గాన్ని అభినందించారు. మదర్ అండ్ అమ్మ బ్లడ్ బ్యాంక్ అధ్యక్షులు జివిఎల్ కిరణ్ మాట్లాడుతూ, దాతల సహకారంతోనే రక్తాన్ని అందించగలుగుతున్నామన్నారు. అనంతరం రక్తదాతలకు జ్ఞాపికలు అందజేశారు. సొసైటీ అధ్యక్షులు కుమార అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సహాయ కార్యదర్శి విజయ్కుమార్, కార్యదర్శి యడ్ల అంజని రాజేష్, జిల్లా సహకార శాఖ అధికారి జె.ప్రవీణ, పాలకవర్గ సభ్యులు గణేష్, సంతోష్, మోహన్, నాగన్ దొర, రమేష్, రమణ, చైతన్య పాల్గొన్నారు.


రక్తదాతలతో నిర్వాహకులు

సమాజ సేవలో ఆనందం

ప్రజాశక్తి -మధురవాడ : సమాజ సేవలో ఆనందం ఉంటుందని నరసింహ కన్స్ట్రక్షన్స్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత పోతిన నరసింహనాయుడు పేర్కొన్నారు. మధురవాడ, మిథిలాపురి వుడా రోడ్డులోని వాణిజ్య సముదాయం వద్ద శుక్రవారం నరసింహనాయుడు 50వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషుల మధ్య జరిగిన ఈ వేడుకల్లో నరసింహనాయుడు పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. పేదలకు బియ్యం, నిత్యావసర వస్తువులు, మహిళలకు చీరలు, పండ్లు పంపిణీ చేశారు. అనాథాశ్రమాలలో భోజనాలు, అయ్యప్ప స్వాములకు భిక్ష ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు కృషిచేస్తానన్నారు. నరసింహనాయుడుకు పిల్లా వెంకట్రావు, మగ్గురి వెంకటరావు, వాండ్రాసి చిన్న శ్రీను, హ్యాండ్స్ టు హెల్ప్ అధినేత చిన్ని వెంకట్, నాగోతి నర్సినాయుడు, పోతిన నాయుడు, బాయిన శ్రీను, పోతిన శ్రీనివాస్ తదితరులు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.


చీరలు పంపిణీచేస్తున్న నరసింహనాయుడు దంపతులు

అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 12వ వార్డు పరిధి బిసి కాలనీ కొండపై విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా పూర్తిగా కాలిపోయిన ఇంటిని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు శుక్రవారం స్థానిక నాయకులతో కలిసి పరామర్శించారు. బాధితులు కొండేటి ఈశ్వరరావు, లక్ష్మిలతో ఎమ్మెల్యే మాట్లాడి ప్రమాదం ఎలా జరిగిందని, ఎంత నష్టం జరిగిందనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. వెంటనే బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని రెవెన్యూ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ పరామర్శలో టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఒమ్మి సన్యాసిరావు, వార్డు అధ్యక్షులు గాడి సత్యం, నాయకులు ముగడ రాజారావు, ఏడువాక సన్యాసిరావు, పోలారావు తదితరులు పాల్గొన్నారు.

వైసిపి సంతకాల సేకరణ

ప్రజాశక్తి -తగరపువలస : మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జివిఎంసి రెండో వార్డు వైసిపి అధ్యక్షుడు చిల్ల భాస్కరరెడ్డి ఆధ్వర్యాన సత్యనారాయణపేటలో కోటి సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ గిడుతూరి కల్యాణి, జీరు వెంకటరెడ్డి, తేడ్లపు అప్పలరాజు, చిప్పాడ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సీతమ్మధార : జివిఎంసి 26, 46వ వార్డుల్లో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. వైసిపి విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు కెకె రాజు పాల్గొని ప్రజల నుంచి సంతకాలను సేకరించారు. కార్యక్రమంలో నాయకులు పీలా వెంకటలక్ష్మి, భోగవల్లి గోవింద్, బొడ్డేటి కిరణ్, ఎం.సునీల్ పాల్గొన్నారు.

జివిఎంసి 44వ వార్డు పరిధి పెద్దపూరు మసీదు వద్ద సంతకాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో బాణాల తరుణ్కుమార్, ఎమ్డి హబీబ్, యాసిన్, గోపి పాల్గొన్నారు.

బిజ్ హబ్ క్రియేషన్ ప్రారంభం

ప్రజాశక్తి-సీతమ్మధార : సీనియర్ జర్నలిస్టు ఎంఎన్ఆర్ స్థాపించిన బిజ్ హబ్ క్రియేషన్ సంస్థను విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విశాఖ రానున్న రోజుల్లో క్రియేటివ్ రంగానికి హబ్గా మారనుందన్నారు. అన్ని రకాల క్రియేటివ్ కంటెంట్, బెస్ట్ గ్రాఫిక్స్, ఎడిటింగ్ సర్వీసెస్ అందించే సంస్థ విశాఖలో ప్రారంభించడం పట్ల ఆనందాన్ని వ్యక్తం చేశారు. హైదరాబాద్ వంటి నగరాలకే పరిమితమైన ఇలాంటి సేవలు విశాఖలో రావడం అభినందనీయమన్నారు. విశాఖ పబ్లిక్ లైబ్రరీలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, యువత పాల్గొన్నారు.

సబ్సిడీపై బోటు ఇంజిన్ల పంపిణీ

ప్రజాశక్తి -భీమునిపట్నం : మత్స్యశాఖ ఆధ్వర్యంలో జివిఎంసి నాలుగో వార్డు పరిధి చేపల తిమ్మాపురంలో ఒక్కొక్క లబ్ధిదారునికి ఒక్కో బోటు ఇంజన్ చొప్పున 10 మందికి మత్స్య శాఖ కమిషనర్ శ్రీరామశంకరనాయక్తో కలిసి స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శుక్రవారం పంపిణీ చేశారు. 80 జిపిఎస్ పరికరాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ పి.లక్ష్మణరావు, ఎఫ్డిఒ ఆర్.ఈశ్వరరాజు పాల్గొన్నారు.


బోటు ఇంజన్లు పంపిణీచేస్తున్న ఎమ్మెల్యే గంటా

ప్లాస్టిక్ వాడకాన్ని మానుకోవాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్లాస్టిక్ నిషేధంలో భాగంగా ప్లాస్టిక్ బ్యాగ్‌లకు బదులు గుడ్డ, నార సంచులు వినియోగిస్తున్న వారిని అనకాపల్లి జీవీఎంసీ జోనల్ కమిషనర్ అభినందించారు. శుక్రవారం అనకాపల్లి అర్బన్ పరిధిలో 83వ వార్డులో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం వల్ల అనర్థాలు, వచ్చే వ్యాధుల గురించి ప్రజలకు వివరించారు. ప్లాస్టిక్ బ్యాగ్‌లకు బదులు గుడ్డ నారసంచులు వినియోగిస్తున్న వినియోగదారులను అభినందించారు. 80వ వార్డు చిన రామస్వామి ఆలయ ప్రాంతంలో పర్యటించి అక్కడ రెవిన్యూ కలెక్షన్, పారిశుధ్య నిర్వహణ పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్ఐ పరదేశి నాయుడు, ఎస్ఐలు ఎం.అప్పారావు, స్థానిక సచివా లయ, జివిఎంసి సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

బాబ్జీని కలిసిన ఆలయ కమిటీ

ప్రజాశక్తి -సబ్బవరం : ఎపి కోఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవెర్స్ పెడరేషన్ చైర్మన్,, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జి ని గ్రామ సర్పంచ్ దాడి లావణ్య కన్నంనాయుడు ఆధ్వర్యంలో సోమలింగేశ్వర స్వామి దేవస్థానం ఆలయ కమిటీ చైర్మన్ దొడ్డి రామవెంకట సత్యనారాయణ, బోర్డు సభ్యులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గండి బాబ్జికి పుష్పగుచ్చం ఇచ్చి శాలువాతో ఘనంగా సత్కరించారు. దేవస్థానం బోర్డు కమిటీ సభ్యులు దాడి శివ సత్యనారాయణ, రాపేటి శ్రీనివాస రావు, నాగిరెడ్డి సన్యాసినాయుడు, వల్లభజోశ్యుల సీతారామ మూర్తి, ఇరోతి భవాని, గొర్లి నారాయణమ్మ, పైడివాడ పార్వతి, వంకర పాపమ్మ, దాడి అప్పారావు మాజీ సర్పంచ్ దాడి సూరిబాబు, అరిపాక నాగరాజు, ఆడారి వెంకట రమణ, శిలపరశెట్టి సత్యనారాయణ, సూరిశెట్టి సూర్యనారాయణ, దాడి శ్రీ రామూర్తి, బత్తిన కోటి, కిల్లి నాగరాజు పాల్గొన్నారు.

ఆక్రమిత భూమి పంచాయతీకి అప్పగింత

ప్రజాశక్తి యస్ రాయవరం :మండలంలో కర్రివానిపాలెం రెవిన్యూ పరిధిలో నక్కల చెరువులో అక్రమణకు గురైన 50సెంట్లు భూమిని అధికారులు స్వాధీనం చేసుకుని పంచాయతీకి అప్పగించారు. .కర్రివానిపాలెం రెవెన్యూపరిధిలో జ్యోతిరావు పూలే బాలికల వసతి గృహం వెనుకనున్న నక్కల చెరువు ఆక్రమణపై సోమిరెడ్డి రాజు అనే వ్యక్తి ఫిర్యాదు మేరకు రాష్ట్ర లోకాయుక్త, ఉపలోకాయుక్తకు ఫిర్యాదు చేయగా, వారి ఆదేశాల మేరకు రెవెన్యూ, నీటిపారుదల, పంచాయతీ అధికారులు స్పందించి ఆక్రమణలు గుర్తించారు. ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేశారు. చెరువు గర్భంలోని ఆక్రమించి వేసిన 59 కొబ్బరిచెట్లును తహసీల్దార్ జె.రమేశ్‌బాబు, నీటిపారుదల శాఖ ఎఇఇ భాను, సర్పంచ్, ఫిర్యాదుదారుడు సోమిరెడ్డి రాజు సమక్షంలో పంచాయతీకి అప్పగించారు.

విఆర్ఒల నూతన కార్యవర్గం

ప్రజాశక్తి, యలమంచిలి టౌన్ : యలమంచిలి మండల గ్రామ రెవిన్యూ అధికారుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరిగింది యూనియన్ అనకాపల్లి డివిజన్ కార్యదర్శి ఎ.శశిధర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికలో అధ్యక్షులుగా పిల్లి మరేశ్వరావు, పలక పృథ్వీ, ఉపాధ్యక్షులు, తెరువుపల్లి సత్యనారాయణ కార్యదర్శి, కోశాధికారిగా కోనలక్ష్మిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. విఆర్ఒలు పాల్గొన్నారు.

వైసిపి రాష్ట్ర కార్యదర్శిగా రవికుమార్



గండి రవికుమార్

ప్రజాశక్తి- సబ్బవరం : వైసిపి రాష్ట్ర కార్యదర్శిగా పెందుర్తి నియోజకవర్గం మొగలిపురం గ్రామానికి చెందిన గండి రవికుమార్‌ను నియమిస్తూ తాడేపల్లి కేంద్ర కార్యాలయం నుంచి నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర కార్యదర్శిగా నియమించడంపై ఆనందం వ్యక్తం చేశారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. తనకు పదవినిచ్చిన అధినేత జగన్మోహనరెడ్డి, ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు, అనకాపల్లి జిల్లా అధ్యక్షులు గుడివాడ అమర్నాథ్‌వ మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు, పెందుర్తి సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్ రాజ్‌అ నకాపల్లి పార్లమెంటు పరిశీలకులు శోభా హైమావతి, అరకు పార్లమెంట్ పరిశీలకులు బొడ్డేడ ప్రసాద్‌లకు ధన్యవాదాలు తెలిపారు.

ఇండోర్ స్టేడియాన్ని వినియోగంలోకి తేవాలి



రాజీవ్ ఇండోర్ స్టేడియం వద్ద నిరసన తెలుపుతున్న వైసిపి నేతలు

ప్రజాశక్తి- అనకాపల్లి : పట్టణంలోని జగన్నాధ థియేటర్ రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియం వినియోగంలోకి తేవాలని వైసిపి నేతలు డిమాండ్ చేశారు. శుక్రవారం స్టేడియం వద్ద నిరసన చేపట్టారు. వైఎస్ హయాంలో రూ.190 లక్షలతో స్టేడియం నిర్మిస్తే, 2019లో తిరిగి మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ కృషి నిధులు వెచ్చించి, స్టేడియంకు కొత్త కళ వచ్చిందన్నారు. తర్వాత దీన్ని వినియోగంలోకి తేవడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. స్టేడియం వద్ద సిమెంట్ రోడ్డు అసంపూర్తిగా ఉండడంతో ప్రమాదాలు జరుగుతున్నా యని, వెంటనే అన్ని పనులు పూర్తి చేసి స్టేడియం వినియోగంలోకి తేవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర గవర కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ బొడ్డేడ శివ, 80వ వార్డు ఇన్‌ఛార్జి కెఎంనాయుడు ఆధ్వర్యంలో నిరసనలో పార్టీ పట్టణ కార్యదర్శి వాసుపల్లి తాతయ్యలు, సుంకర వెంకటేశ్వరరావు, మద్దాల శివనాయుడు, చదరం పరమేష్, రాపేటి సునీల్ పాల్గొన్నారు.

బదిలీ వ్యాయామ ఉపాధ్యాయునికి సత్కారం

ప్రజాశక్తి - యలమంచిలి : అంకిత భావంతో పనిచేసే ఉద్యోగులు ఏ రంగంలో ఉన్నా గుర్తింపు ఉంటుందనిగుడివాడ పాఠశాల పూర్వ హెచ్ఎం సుజాత అన్నారు. శుక్రవారం బదిలీపై వెళ్తున్నకొత్తపేట హైస్కూలు వ్యాయామ ఉపాధ్యాయులు కుందూరు రాజును ఘనంగా సత్కరించారు.ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

ప్రజాశక్తి - యలమంచిలి/ యలమంచిలి టౌన్ : మారిన కొత్త క్రిమినల్ చట్టాలు, ట్రాఫిక్ నిబంధనలపై స్థానిక భాష్యం పాఠశాల విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. టౌన్ ఎస్ఐ.సావిత్రి, ట్రాఫిక్ ఎస్ఐ.రామకృష్ణ పాల్గొ, చట్టాలు, ట్రాఫిక్ నిబంధనలపై వివరించి, ప్రతిఒక్కరూ పాటించాలని సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం, రాంగ్ రూట్‌లో ప్రయాణించడం, ఆటోల్లో లెక్కకు మించి విద్యార్థులు ప్రయాణించడం ప్రమాదకరమన్నారు. అనంతరం పాఠశాల నుంచి ఆర్‌టిసి కాంప్లెక్స్ వరకు అవగాహన ర్యాలీ చేశారు భాష్యం పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదలకు చెప్పుల పంపిణీ

ప్రజాశక్తి-చోడవరం: స్థానిక సత్యసాయి శతజయంతిని పురస్కరించుకుని శుక్రవారం రోడ్లపై చెప్పులు లేకుండా తిరుగుతున్న పలువురికి చెప్పులు పంపిణీ చేశారు. ఆసుపత్రిలో రోగులకు తినుబండారాలు అందించారు. సేవా సమితి కన్వీనర్ సరగడం నాగరాజు, బి లోవరాజు, టి నూకరాజు, వేగే అప్పారావు, డివి అప్పారావు, సాయికుమార్ పాల్గొన్నారు.

పాలకేంద్ర భవనానికి శంకుస్థాపన

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట: పాడి రైతుల సంక్షేమమే ధ్యేయంగా విశాఖ డెయిరీ పనిచేస్తుందని డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ అన్నారు. శుక్రవారం పాత కొండెంపూడిలో రూ.6 లక్షల నిధులతో పాలకేంద్రం భవనానికి శంకుస్థాపన చేశారు.కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఆది సత్తిబాబు, పాల సంఘం అధ్యక్షులు దొండా రాజు, దొండా శ్రీను పాల్గొన్నారు.

సిద్ధ ఆయుర్వేద వైద్య శిబిరం

ప్రజాశక్తి- అనకాపల్లి : రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం గోఅధారిత ప్రకృతి వ్యవసాయ సేవా సంఘం సౌజన్యంతో మళ్ల జగన్నాదం కళ్యాణ మండపంలో సిద్ధ ఆయుర్వేద ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. బిఎస్ గుప్తా, కర్రి సన్యాసినాయుడు, బొడ్డేడ రామ సత్యనారాయణ జ్యోతి ప్రజ్వలనతో శిబిరాన్ని ప్రారంభించారు.

కార్యక్రమంలో ఆయుర్వేద నిపుణులు చింతల జగదీష్, బిహెచ్ శ్రీనాథ్, స్వాతి పాల్గొని పలువురి వెన్నెముక, మోకాళ్లు, మెడ, భుజాలు, కీళ్ళ నొప్పుల సమస్యలను చికిత్స చేశారు.క్లబ్ అధ్యక్షులు బుద్ధ శ్రీనివాసరావు, కార్యదర్శి కెవిపిఎస్ ప్రకాష్ రావు, కోశాధికారి బి సర్వారావు, రాష్ట్ర గవర్నర్ కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, సభ్యులు బుద్ధ సత్యనారాయణ, దాడి రవి, సాన త్రినాథ్ పాల్గొన్నారు.

గిరిజనులకు కుట్టుమిషన్ల పంపిణీ

ప్రజాశక్తి-అనకాపల్లి : సామాజిక సేవలో రోటరీ క్లబ్ ముందుంటుందని రోటరీ ఇంటర్నేషనల్ గవర్నర్ డాక్టర్ కల్యాణచక్రవర్తి అన్నారు. శుక్రవారం స్థానిక రోటరీక్లబ్‌లో గిరిజన ప్రాంత మహిళలకు రోటరీ కుట్టుమిషన్లు, అల్లిక చట్రాలు, మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలోరూ. 60 వేల విలువైన బెంచులు అందజేశారు. సమావేశంలో అసిస్టెంట్ గవర్నర్ నాగేంద్రరాజు, స్థానిక రోటరీ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు బుద్ధ శ్రీనివాసరావు, కెవిపిఎస్ ప్రకాశరావు పాల్గొన్నారు

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : నియోజకవర్గ అభివృద్ధికి అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పని చేయాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ సూచించారు. శుక్రవారం గుండాల జంక్షన్ జివిఎంసి ఎస్ఆర్ శంకరన్ మీటింగ్ హాల్‌లో వివిధ శాఖల అధికారులతో సమీక్షించి, సూచనలు చేశారు. అధికారులు చిత్తశుద్ధితో పనిచేస్తేనే ప్రజాసమస్యల పరిష్కారం, అభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో ఆర్‌డిఓ షేక్ అయిషా, ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ ప్రసాద్, డిఇఇ రాజశేఖర్, జోనల్ కమిషనర్ చక్రవర్తి,ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం



ఎలమంచిలిలో వినతులు స్వీకరిస్తున్న టిడిపి నేతలు

ప్రజాశక్తి - యలమంచిలి : ప్రజల సమస్యలు ప్రభుత్వ అధికార్ల దృష్టికి తీసుకొచ్చి వాటిని పరిష్కరించడమే 'ప్రజాదర్బార్' ముఖ్య ధ్యేయమని రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం యలమంచిలి మెయిన్‌రోడ్డులోని తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యలయంలో 'ప్రజాదర్బార్'లో పాల్గొని అర్జీలు స్వీకరించారు. యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ ధూళి రంగనాయకులు, మండల అధ్యక్షులు గొర్లె శివనారాయణ, ఇత్తంశెట్టి సన్యాసినాయుడు, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ మామిడి శివప్పారావు, కార్యదర్శి ఆడారి ఆదిమూర్తి, రమణబాబు, కొండబాబు, కరణం రవికుమార్, గొర్లె బాబూరావు, కరెడ్ల మల్లికార్జునరావు, దాడి రమేష్, కట్టమూరు చిత్తేశ్వరరావు, యల్లపు శ్రీను, రామినేని రమేష్ చౌదరి పాల్గొన్నారు.

అనకాపల్లి రూరల్: ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, అవసరమైతే ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళతామని రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. శుక్రవారం స్థానిక టిడిపి కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించి వినతులు స్వీకరించారు. కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. సురేంద్ర, సిదిరెడ్డి శ్రీను, బొలిశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉద్యోగుల గ్రీవెన్స్‌కు 13 అర్జీలు



మహిళా ఉద్యోగుల సమస్యలు వింటున్న కలెక్టర్

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రభుత్వ ఉద్యోగుల న్యాయపరమైన సమస్యల సత్వర శుక్రవారం చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు.కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతినెలా మూడో శుక్రవారం ప్రత్యేక గ్రీవెన్స్‌లో భాగంగా పలువురు ఉద్యోగుల నుండి అర్జీలు స్వీకరించారు. వ్యక్తిగతంగా ప్రతి ఒక్కరి సమస్యను అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేక గ్రీవెన్స్‌లో పంచాయతీ రాజ్ శాఖ విభాగానికి సంబంధించి తొమ్మిది, రెవిన్యూ విభాగానికి సంబంధించి మూడు అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో పిజిఆర్ఎస్ సమన్వయ అధికారి ఎస్.సుబ్బలక్ష్మి, కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి విజయ్‌కుమార్, పిజిఆర్ఎస్ సెల్ పర్యవేక్షకుడు సురేష్ నాయుడు, పాల్గొన్నారు.

మరుగుదొడ్ల వినియోగంపై చైతన్యం

ప్రజాశక్తి- అనకాపల్లి : గృహ, సామూహిక మరుగుదొడ్ల వినియోగంపై గ్రామీణ ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని జిల్లా గ్రామీణ మంచి నీటి సరఫరా శాఖ అధికారులను జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్లోని తన చాంబర్లో అంతర్జాతీయ మరుగుదొడ్ల దినోత్సవ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు, ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతు అంతర్జాతీయ మరుగుదొడ్ల దినోత్సవ కార్యక్రమాన్ని జిల్లాలో అన్ని గ్రామాల్లో ఈనెల 19 నుండి వచ్చేనెల 10 తేదీ వరకు నిర్వహించాలన్నారు. గ్రామాలలో మరమత్తులకు గురైన వ్యక్తిగత, సామూహిక మరుగుదొడ్ల గుర్తించి వాటిని సత్వరమే వాడుకలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఇఇ జె అనిల్‌కుమార్, డిఇఇ సావిత్రి, సిబ్బంది పాల్గొన్నారు.

మరుగుదొడ్ల పునరుద్ధరణ

ప్రజాశక్తి, యలమంచిలి టౌన్ : పట్టణంలోని ధర్మవరం కనకమహాలక్ష్మి గుడి సమీపంలో ఉన్న ప్రజామరుగుదొడ్లును మున్సిపల్ సిబ్బంది వినియోగంలోకి తెచ్చారు. అధ్వానంగా ఉన్న ఈ మరుగుదొడ్లను ఆలయ కమిటీ చైర్మన్ కొఠారు సాంబశివ , కౌన్సిలర్ చిరంజీవి, మున్సిపల్ ఎఇ నానాజీ పర్యవేక్షణలో శుభ్రం చేసి పునరుద్ధరించారు. స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆకట్టుకున్న భరతనాట్య ప్రదర్శన



బహుమతులు అందుకున్న చిన్నారులతో నాగలక్ష్మి, తదితరులు

ప్రజాశక్తి -యస్ రాయవరం: మండల కేంద్రంలోని తాడేల వీధిలోవరసిద్ధి వినాయక ఆలయం 13 వార్షికోత్సవం సందర్భంగా చిన్నారుల భరతనాట్య ప్రదర్శన నిర్వహించినట్టు టిడిపి మండల మహిళా అధ్యక్షురాలు కొమ్మిరెడ్డి నాగలక్ష్మి తెలిపారు. ఆలయం వార్షికోత్సవం పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భారీ అన్నదానం కార్యక్రమం చేపట్టారు. రాత్రి చిన్నారుల భరతనాట్యం ప్రదర్శన విశేషంగా అలరించింది. నృత్యకళాకారులను నాగలక్ష్మి దంపతులు బహుమతులు అందజేసి అభినందించారు.

భక్తిశ్రద్ధలతో గంగాహారతి

ప్రజాశక్తి-దేవరపల్లి : కార్తీక మాసం ముగింపు, పోలి పాడ్యమి పురస్కరించుకొని శుక్రవారం వేచలం గ్రామంలో శారద నది ఒడ్డున కోడూరు వెంకటరావు భవాని ఆధ్వర్యంలో గంగాహారతి నిర్వహించారు కార్యక్రమంలో ఎంపిటిసి రెడ్డి శ్రీలక్ష్మి, బలరాం బూరె బాబురావు, రెడ్డి జగ్గారావు, భవానీ దీక్షాపరులు, మహిళలు పాల్గొన్నారు

అన్నదాతలకు నిధులు విడుదలపై హర్షం



పాలాభిషేకం చేస్తున్న కూటమి నేతలు

ప్రజాశక్తి -అనకాపల్లి : అనకాపల్లి నియోజకవర్గంలో 22,300 మంది రైతులకు అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ సాయం రూ.14.60లక్షలు విడుదలపై కూటమి నేతలు హర్షం వ్యక్తం చేస్తూ, శుక్రవారం తుమ్మపాల గ్రామంలో ప్రధాని మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఎమ్మెల్యే కొణతాల, ఎంపీ సీఎం రమేష్ చిత్రపటాలకు పాలాభిషేకం చేసారు. జిల్లాలో 2,42,480 మంది రైతుల ఖాతాలలో రూ.158.4 కోట్లు జమ అయిందన్నారు. కార్యక్రమం లో టిడిపి మండల అధ్యక్షులు కర్రి వెంకట సన్యాసినాయుడు, తెలుగు రైతు మండల అధ్యక్షులు పీలా బుజ్జి, జనసేన నాయకులు ఎంపిటిసి నాగేశ్వరావు, తుమ్మపాల పాల సొసైటీ అధ్యక్షులు చదరం కాశీ, తుమ్మపాల నీటి సంఘం చైర్మన్ సీతారాం, రాపేటి రామ్ కుమార్, పీలా తాతు నాయుడు, స్కూల్ కమిటీ చైర్మన్ పెతకంశెట్టి బలరాం, గ్రామ కమిటీ అధ్యక్షులు కొణతాల రమణ బాబు, కార్యదర్శి నడిపల్లి బోసుబాబు పాల్గొన్నారు.

ఎపిటిఎఫ్ నూతన కార్యవర్గం

ప్రజాశక్తి - యలమంచిలి : యలమంచిలి మండల ఎపిటిఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక స్థానిక ఆర్ఎస్‌రోడ్డు ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగింది. బొడ్డేటి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు కెఇఎల్ఎన్. ధర్మారావు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. నూతన కార్యవర్గం అధ్యక్షులుగా ఎ.చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా ఎన్.భూషణం, ఉపాధ్యక్షులుగా ఎం.సత్యనారాయణ, కె.కె.రామలక్ష్మి, పి.శ్రీనివాసరావు, కార్యదర్శులుగా వై.సత్యారావు, పి.అప్పారావు, ఎ.పాపారావు, కె.అమ్మాజీ, జిల్లా కౌన్సిలర్‌గా బి.సత్యనారాయణ, కె.వీరభద్రరావు, జి.సర్వేశ్వరరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

భోజన దాతలకు సత్కారం



భోజన దాతలను సత్కరిస్తున్న సేవాకమిటీ సభ్యులు

ప్రజాశక్తి -ఎస్ రాయవరం : మండలంలో అడ్డురోడ్ తిమ్మాపురం గ్రామంలో అయ్యప్ప సేవా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం చివరి రోజున గుర్రం సత్యనారాయణ భవాని దంపతులు ఆర్థిక సహాయంతో ఉచిత అన్న ప్రసాద వితరణ నిర్వహించినట్టు కొరుప్రోలు పిఎసిఎస్ చైర్మన్ గుర్రం రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా 41 రోజులపాటు అన్నదాన కార్యక్రమానికి ఆర్థిక సహాయం చేసిన దాతలందరినీ అయ్యప్ప సేవా కమిటీ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు అమలకంటి అబద్ధం, మాజీ ఎంపిపి వినోద్ రాజు, మండల మాజీ అధ్యక్షులు ఎన్ వెంకటరాజు, గుర్రం నానాజీ, టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్, సర్పంచ్ వి గోవింద్, కర్రి ధర్మారావు బాబూరావు, కోన అప్పలరాజు పాల్గొన్నారు.

పిచ్చికుక్క దాడిలో మరో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి -వడ్డాది : పిచ్చికుక్క దాడిలో మరో ఇద్దరు గాయపడ్డారు. వారం రోజుల క్రితం వడ్డాదిలో 20 మంది వ్యక్తులను, 10 పశువులను గాయపరిచిన పిచ్చికుక్క కోసం స్థానికులు,.పంచాయతీ సిబ్బంది వారం రోజులుగా గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. తాజాగా శుక్రవారం ఉదయం బంగారు మెట్ట కూడలిలో మరో ఇద్దరిని దాడి చేసి గాయపరిచింది. బంగారు మెట్ట కూడలిలో ఎనిమిదేళ్ల బాలుడి, కృష్ణంపాలెం గ్రామానికి చెందిన వ్యక్తి బైక్‌పై వెళుతుండగా అతడిని కరిచి గాయపరిచింది గాయపడిన ఇద్దరు వ్యక్తులను వడ్డాది ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం చోడవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గాయపరిచిన కుక్కని స్థానికులు హతమార్చారు. దీంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

మాకిరెడ్డి మరణం తీరని లోటు



సంస్మరణ సభలో మాట్లాడుతున్న సిపిఐ నేత సత్యనారాయణమూర్తి

ప్రజాశక్తి-అనకాపల్లి : సిపిఐ జిల్లా కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు మరణం తీరనిలోటని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి సత్యనారాయణమూర్తి అన్నారు. శుక్రవారం అనకాపల్లి సిపిఐ కార్యాలయంలో బాలేపల్లి వెంకటరమణ అధ్యక్షతన మాకిరెడ్డి సంస్మరణ సభ నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మీసాల సుబ్బన్న పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ చిన్నతనం నుంచే కమ్యూనిస్టు భావజాలంతో పనిచేసే రామునాయుడు, ప్రజానాట్యమండలి ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షుడిగా, గొలుగొండ మండల కార్యదర్శిగా పనిచేసి ప్రజా సమస్యలపై పోరాటాలు, పార్టీ బలోపేతానికి కృషి చేశారన్నారు. జిల్లా విభజన అనంతరం అనకాపల్లి జిల్లా సహాయ కార్యదర్శిగా ఎన్నికై, ద్వితీయ మహాసభలో జిల్లా కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికైన ఆయన మరణం బాధాకరమన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మీసాల సుబ్బన్న మాట్లాడుతూ వామపక్ష ఉద్యమాలకు రామునాయుడు మరణం తీరని లోటన్నారు. జిల్లాలో అనేక ఉద్యమాల్లో కలిసి పనిచేసిన ఆయన భౌతికంగా దూరమవ్వడం బాధాకరమన్నారు. రామునాయుడు పోరాట స్ఫూర్తితో వామపక్ష పోరాటాల బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు కార్యక్రమంలో ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షులు అరుణాద్‌రెడ్డి, సిపిఐ కార్యవర్గ సభ్యులు జగ్గారావు, రాజాన దొరబాబు, పరమేశ్వరి, రెడ్డి అప్పలనాయుడు, జి ఫణింద్ర కుమార్, వి.రాజు,తాకాసి వెంకటేశ్వరరావు, రాధాకృష్ణ కన్నబాబు ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు బాబ్జి పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు శిక్షణ



చోడవరంలో పారిశుధ్య కార్మికులకు సత్కారం

ప్రజాశక్తి -చోడవరం : పారిశుధ్య కార్మికులు సేవలు వెలకట్టలేనివని డిఎల్‌పిఒ మంజుల వాణి అన్నారు. శుక్రవారం రైతు రాజుపేట గ్రామంలో పారిశుధ్య కార్మికులకు ఒకరోజు శిక్షణనిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ బొడ్డెడ రామునాయుడు, బొడ్డెడ గంగాధర్, ఎంపిడిఒ ఆంజనేయులు. డిప్యూటీ ఎంపిడిఒ అర్జున రావు, పలు గ్రామాల కార్యదర్శులు, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

యస్ రాయవరం : మండలంలోని గుడివాడ గ్రామ పంచాయతీలో క్లీన్‌అండ్‌గ్రీన్ విలేజ్ అనే అంశాలపై మండలంలోని క్లాప్ మిత్రులకు శుక్రవారం ఒక్కరోజు శిక్షణనిచ్చినట్టు ఎంపిడిఒ కార్యక్రమం పి. మీనాకుమారి తెలిపారు. గుడివాడ, లక్ష్మీపతి రాజుపేట, కొత్త పోలవరం గ్రామాల పారిశుధ్య కార్మికులకు తడిపొడి చెత్తసేకరణ, సంపద కేంద్రాలకు తరలింపుపై వివరించారు.డిప్యూటీ ఎంపిడిఒ బంగారు సత్యనారాయణ, సర్పంచ్ ధూళి శ్రీనుబాబు,ఉప సర్పంచ్ రామకృష్ణ రాజు, పాల్గొన్నారు.

పద్మనాభం : మండలంలోని 22 గ్రామపంచాయతీ పరిధిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు ఈ నెల 20 నుండి 24 వరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు డిఎల్‌డిఒ నిర్మలాదేవి తెలిపారు. పారిశుధ్య కార్మికులకు గ్రామస్థాయిలో చెత్త సేకరణపై శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు.

ఆనందపురం : ఆనందపురం మండలం వెల్లంకి లోకల్ ట్రైనింగ్ సెంటర్‌లో ఘన వ్యర్థాల నిర్వహణపై ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని 26 పంచాయతీలకు చెందిన క్లాప్ మిత్రులు, పంచాయతీ కార్యదర్శులు ఈ శిక్షణలో పాల్గొన్నారు. శిక్షణలో భాగంగా వెల్లంకి గ్రామంలోని ప్రతి వీధిని శుభ్రపరిచి, చెత్తను వనరుగా మార్చుకోవడంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సిఇఒ నారాయణమూర్తి, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసరావు, ఎంఐఆర్‌డి ప్రతినిధి కె.నాగరాజు, ఎంపిడిఒ డాక్టర్ వి.జానకి తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్

ప్రజాశక్తి -యస్ రాయవరం : మండలంలోని దార్లపూడి చినగుమ్ములూరు, పెద్దగుమ్ములూరు, గుడివాడ ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు శుక్రవారం ఉదయం శ్రీఆదర్శ విద్యాసంస్థలు చైర్మన్ సీతారామరాజు, శ్రీ వెంకటేశ్వర పోలీ క్లినిక్ డాక్టర్ అనిల్ వర్మ సంయుక్తంగా స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా సీతారామరాజు మాట్లాడుతూ గ్రామీణ విద్యార్థులు విద్యలో ఉన్నతంగా రాణించడానికి ఎల్లప్పుడూ తాము సహాయ సహకారాలు అందిస్తామన్నారు. డాక్టర్ అనిల్ వర్మ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచిత వైద్యసాయానికి వెంకటేశ్వర పోలి క్లినిక్ ఎల్లప్పుడూ ముందంజలో ఉంటుందన్నారు. స్టడీ మెటీరియల్ స్వీకరించిన విద్యార్థులు దాతలకు ధన్యవాదాలు తెలిపారు.

30లోగా ఇళ్ల మంజూరుకు దరఖాస్తులు

ప్రజాశక్తి-వడ్డాది : రాష్ట్రంలో ఎన్‌టిఆర్ హౌసింగ్ స్కీం కోసం అర్హత కలిగిన లబ్ధిదారులు ఈనెల 30 తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు తెలిపారు.అర్హత కలిగిన లబ్ధిదారులు సంబంధిత గ్రామ, వార్డు సచివాలయాలలో ఆధార్, రైస్‌కార్డులతో దరఖాస్తు సమర్పించాలన్నారు. రాష్ట్రంలో అర్బన్, రూరల్ హౌసింగ్ స్కీంలలో మూడు కేటగిరీల విభాగాలలో ఇల్లు మంజూరు చేస్తామన్నారు .స్థలం లేని వారికి స్థలమిచ్చి ఇల్లు మంజూరు చేస్తామన్నారు

కుదువ పెట్టిన బంగారానికి కత్తెర

- స్వర్ణకారుని నిర్వాకం

ప్రజాశక్తి - చోడవరం : చోడవరం మెయిన్ రోడ్డులో ఉన్న కనక మహాలక్ష్మి ప్రైవేట్ బ్యాంకులో గతంలో పనిచేసిన ఓ స్వర్ణకారుడు చేతివాటం ప్రదర్శించిన వైనం ఆలస్యంగా వెలుగుచూసింది. వినియోగదారులు తాకట్టు పెట్టిన బంగారాన్ని కానరాకుండా ఆయన కత్తిరించేశాడు. ఇప్పటి వరకు ఎనిమిది మంది ఖాతాదారుల నుంచి కాజేసిన బంగారాన్ని తిరిగి ఇచ్చేసినట్టు బ్యాంకు సిబ్బంది చెబుతున్నారు. బంగారం నాణ్యతను పరిశీలించేందుకు బ్యాంకులో ఉండే స్వర్ణకారుడు ద్వారానే ఈ మోసం జరిగిందని అంటున్నారు. చోడవరానికి చెందిన వి.రాధ 60 గ్రాముల బంగారు గొలుసును బ్యాంకులో తాకట్టు పెట్టింది. దాని లింకులను సదరు స్వర్ణకారుడు కాజేశాడు. దీంతో ఆమె ప్రశ్నించగా బ్యాంకువారు బంగారాన్ని తిరిగి ఇచ్చారు. ఇలా 2018 నుండి 2024 వరకు బ్యాంకులో స్వర్ణకారుడిగా పనిచేసిన చోడవరానికి చెందిన కోనేటి సతీష్ ఈ మోసానికి పాల్పడ్డాడని బ్యాంకు సిబ్బంది చెబుతున్నారు. ఎక్కువగా కుదువ పెట్టిన బంగారాన్ని రెన్యువల్ చేసినప్పుడు స్వర్ణకారులు తూనికను తప్పుగా చూపించి బ్యాంకు అధికారులను బురిడీ కొట్టిస్తుంటారని చెబుతున్నారు. దీనిపై కనకమహాలక్ష్మి బ్యాంకు మేనేజర్ కెవి.స్వామి నాయుడు మాట్లాడుతూ తమ బ్యాంకులో గతంలో పనిచేసిన స్వర్ణకారుడు వల్ల అవకతవకలు జరిగాయని, కొంత మంది ఖాతాదారుల నుంచి కాజేసిన బంగారాన్ని వారికి తిరిగి ఇచ్చేశామని తెలిపారు.

పలుచోట్ల అన్నసమారాధనలు



అనకాపల్లిలో అన్నసమారాధనలో పాల్గొన్న రాంకీ, తదితరులు

ప్రజాశక్తి- అనకాపల్లి రూరల్: భోగలింగేశ్వర దేవస్థానంలో బహుళ పోలి పాడ్యమి సందర్భంగా అన్న సమారాధనను జనసేన అనకాపల్లి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మర భీమరశెట్టి రాంకీ ప్రారంభించారు. ఈ సందర్భంగా రాంకీని దేవస్థానం ఇఒ బి.మురళీకృష్ణ, కమిటీ సభ్యులు సత్కరించారు ఆలయ కమిటీ చైర్మన్ సత్యనారాయణ, ధర్మకర్తలు మద్దాల నారాయణరావు, ఎలమంచిలి బంగారు రాజు, రాపేటి సంతోష్ కుమార్, పెంటకోటి గణేష్, దూలం సత్యవతి, బాదంపూడి కొండమ్మ పాల్గొన్నారు.

కె.కోటపాడు :మండలంలోని చౌడువాడ గ్రామంలో షిరిడి సాయిబాబా ఆలయ 29వ వార్షికోత్సవాన్ని పురస్కరించు కుని అన్నసమారాధన నిర్వహించారు. ఆలయం వద్ద ప్రత్యేక పూజలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. విశాఖ డెయిరీ డైరెక్టర్ సుందరపు గంగాధర్, సుగర్ ఫ్యాక్టరీ మాజీ డైరెక్టర్ రాజి శ్రీనివాస రావు, కమిటీ సభ్యులు రాజి మోది నాయుడు, పాల సొసైటీ అధ్యక్షులు కుమార వెంకటరమణ పాల్గొన్నారు .

మునగపాక: మండలంలోని తోటాడ గ్రామంలో భావనారుషి భద్రావతి కాశీ విశ్వేశ్వర దేవస్థానంలో కార్తీక మాసం ఆఖరి రోజు, పోలి పాడ్యమి సందర్భంగా అన్న సమారాధన నిర్వహించారు.పద్మశాలీ సేవా సంఘం నిర్వహణలో అన్న ప్రసాద వితరణకు భక్తులు పోటెత్తారు. ధర్మకర్తలు దొడ్డి సూర్య నారాయణ, త్రినాద్, సన్యాసిరావు, తాతబాబు, సత్యనారాయణ, పద్మ శాలీ సంఘం కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

నక్కపల్లి:మండలంలోని పలు గ్రామాల్లో కార్తీక మాసం పరిష్కరించుకుని శుక్రవారం పోలీ పాడ్యమిని భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండలంలోని ఉపమాక శివాలయం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. ఆలయ అర్చకులు మహేష్, సతీష్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. నక్కపల్లి పీఏసీఎస్ అధ్యక్షులు కొప్పిశెట్టి బుజ్జి, గ్రామ పెద్దలు, యువకులు భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేసారు.

గోపాలపట్నం : జివిఎంసి 92వ వార్డు పరిధి నందమూరినగర్‌లో శ్రీ ఉమా రామలింగేశ్వర శ్రీ సీతారామ, శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో కార్తీకమాస పోలి పాడ్యమి సందర్భంగా అన్న సమారాధన నిర్వహించారు. జనసేన నాయకులు బెహరా భాస్కరరావు ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.కార్యక్రమంలో ధవళ గోపాల్, బండారు నాగేశ్వరావు, నీలాపు మహాలక్ష్మి రెడ్డి, పాల్గొన్నారు.

తగరపువలస : పోలిపాడ్యమి సందర్భంగా శ్రీరాంనగర్, టి.నగరపాలెం, చిప్పాడ, మూలకుద్దు, అన్నవరం తగరపువలస గోస్తని నదీ తీర ప్రాంతాలలో భారీ సంఖ్యలో భక్తులు శుక్రవారం నదీ స్నానాలు చేసి దీపాలు వెలిగించారు. శుక్రవారం తెల్లవారుజాము నుండే భక్తులు గోస్తని వద్దకు చేరుకున్నారు. అనంతరం నది తీరంలోని శివాలయం, సుత్తమ్మ తల్లి గుడి దేవాలయాల్లో పూజలు నిర్వహించారు.

ఆరిలోవ : ఆరిలోవ కాలనీ ఉమారామలింగేశ్వర ఆలయం వద్ద మహా అన్నసమారాధనను ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ప్రారంభించారు. కార్యక్రమంలో ఏడువాక సన్యాసిరావు, మజ్జి రమణి, పట్టా నూకరాజు పాల్గొన్నారు.

ప్రజాశక్తి 7
శనివారం 22 నవంబర్ 2025

బల్క్‌డ్రగ్ పార్కుతో మత్స్య సంపదకు ముప్పు

-వేట పరికరాలతో మత్స్యకారుల నిరసన



నిరసన తెలుపుతున్న మత్స్యకారులు

ప్రజాశక్తి- నక్కపల్లి:బల్క్ డ్రగ్ పార్క్ రద్దు చేసే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని మత్స్యకారులు స్పష్టం చేసారు. మండలంలో మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో బల్క్ డ్రగ్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మత్స్యకారులు తలపెట్టిన శాంతియుత రిలే దీక్షలు శుక్రవారం నాటికి 69వ రోజుకు చేరింది. ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా మత్స్యకారులు, మత్స్యకార మహిళలు సాంప్రదాయ వేట పరికరాలు చేతపట్టుకుని వినూత్నంగా నిరసన తెలియజేశారు. బల్క్ డ్రగ్ ను వ్యతిరేకిస్తూ మత్స్యకారులు పెద్దపెట్టున నినాదాలు చేశారు. బల్క్ డ్రగ్ ఏర్పాటు చేసి తమ పొట్ట కొట్టొద్దన్నారు. బల్క్ డ్రగ్ ఏర్పాటు చేస్తే మత్స్య సంపద నశించిపోతుందని ఆవేదన వ్యక్తం చేసారు. చేపల వేట తప్ప మరే వత్తి తమకు తెలియదని,గంగమ్మ తల్లి నుండి తమను దూరం చేయెుద్దన్నారు. సముద్రాన్ని నమ్ముకుని జీవనం సాగిస్తున్నామని, బల్క్ డ్రగ్ ఏర్పాటు చేసి తమ ఉనికిని దెబ్బ తీయెుద్దన్నారు. ఇప్పటికే తమ జీవితాలు సర్వనాశనం అయ్యాయని ఆవేదన వెలిబుచ్చారు. తమ జీవన విధానాన్ని, ఉనికిని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం బల్క్ డ్రగ్ ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎం.మహేష్ బాబు, గోసల సోమేశ్వరరావు, పి.కోదండరావు, సూరిబాబు, కాశీరాజు, అప్పలరాజు, చిట్టమ్మ , సోమేష్ తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి మార్గశిర పూజలు

ప్రజాశక్తి - యలమంచిలి :స్థానిక ధర్మవరం వీధిలోని కనకమహాలక్ష్మి అమ్మవారి మార్గశిర మాసోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలి పూజను ఆలయ వ్యవస్థాపకులు కొఠారు రాంబాబు కుటుంబీకులు, వర్రె నూకినాయుడు, సావిత్రి దంపతులు చేశారు. అనంతరం 1008 మంది మహిళలు బిందెలతో అమ్మవారికి జలాభిషేకం చేశారు. నెల రోజులు పాటు వేడుకలను జయప్రదం చేయాలని ఉత్సవ కమిటీ చైర్మన్ కొఠారు సాంబశివరావు కోరారు. కొండబాబు, ఎబిఎల్ రాజు, కొఠారు నరేశ్, తాటిపాకల నాని, కొఠారు సూర్యప్రకాశ్, కసిరెడ్డి నాగు, తాటి పాకల చిన్ని, పిల్లా రాము, పుల్లా నాని, కొఠారు శ్రీను పాల్గొన్నారు.

వైసిపి నూతన కార్యవర్గం ఎన్నిక

అభినందనలు తెలిపిన బూడి ముత్యాలనాయుడు



సత్కరిస్తున్న బూడి

ప్రజాశక్తి -చీడికాడ:రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీఈసీ మెంబర్, మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు ఆదేశాల మేరకు చీడికాడ మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గొల్లవెల్లి రాజబాబు, పార్టీ యువత అధ్యక్షుడు గొల్లవిల్లి స్వామి నాయుడు ఆధ్వర్యంలో బైలపూడి గ్రామ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నూతన కార్యవర్గం ఎన్నికైంది. బైలపూడి గ్రామ పార్టీ అధ్యక్షుడిగా జాజిమొగ్గల అప్పారావు (సూదులు) ఉపాధ్యక్షుడుగా గొల్లవెల్లి రామకృష్ణ, మహిళా విభాగం అధ్యక్షులుగా గుమ్మాల కుమారి, ఉపాధ్యక్షులుగా దారపు కోటిలక్ష్మి, ఖండివెల్లి సన్యాసమ్మ, రైతు విభాగం అధ్యక్షులుగా గాడి సత్తిబాబు, ఉపాధ్యక్షులుగా గెంజి శ్రీను, గుమ్మడి నాయుడు, యూత్ విభాగం అధ్యక్షులుగా గెంజి నాగేష్, ఉపాధ్యక్షులుగా దారపు చెల్లారావు, .సోషల్ మీడియా విభాగం అధ్యక్షులుగా వర్రె రవి ఉపాధ్యక్షులుగా గుమ్మాల తేజ, గొల్లవెల్లి గణేష్ సీ విభాగం అధ్యక్షులుగా కాశి సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా కిర్లంపల్లి చిన్న, బొట్ట దేముడుబాబు, కుమార అప్పారావు ఎస్సీ విభాగం అధ్యక్షులుగా పట్నాల రామారావు, ఉపాధ్యక్షులుగా పట్నాల ఈశ్వరరావు, విద్యార్థి విభాగం అధ్యక్షులుగా గుమ్మాల త్రినాథ్, ఉపాధ్యక్షులుగా గాడి శశిధర్ లను నియమించినట్లు రాజబాబు తెలిపారు. నూతన కార్యవర్గాన్ని మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు అభినందించారు,.

వార్షిక ప్రణాళిక బడ్జెట్‌పై ముగిసిన శిక్షణ



శిక్షణలో పాల్గొన్న వెలుగు ఉద్యోగులు, సిబ్బంది

ప్రజాశక్తి -నక్కపల్లి:నక్కపల్లి వెలుగు కార్యాల యంలో 8 మండలాల వెలుగు సిబ్బందికి 2026- 27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వార్షిక ప్రణాళిక బడ్జెట్ రూపకల్పనపై వెలుగు ఏపిఎం శ్రీనివాస్ ఆధ్వర్యంలో 4 రోజులు పాటు నిర్వహించిన శిక్షణ శుక్రవారం ముగిసింది. 8 మండలాలకు సంబంధించి వెలుగు ఏపీఎంలు, సీసీలు, ఎల్వీలు, యంయస్ అకౌంటెంట్స్‌లకు ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వార్షిక ప్రణాళిక బడ్జెట్ రూపకల్పనపై వెలుగు జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వెంకటరమణ, జిల్లా ఏపీఎం కళ్యాణి హాజరై శిక్షణ ఇచ్చారు.గ్రామ సంఘాల అధ్యక్షుల తో పాటు సిబ్బంది భాగస్వామ్యంతో ఒక నిర్దిష్టమైన లక్ష్యం పెట్టుకుని, ఆ దిశగా వార్షిక బడ్జెట్ ను తయారు చేసుకోవాలని సూచించారు. పాయకరావుపేట, చీడికాడ, రావికమతం, రోలుగుంట, దేవరపల్లి, కె కోటపాడు, కశింకోట మండలాల్లో ఆయా మండలాల వార్షిక కార్యాచరణ ప్రణాళికలు ఈ నెల 25 నుంచి 28వ తేదీ వరకూ శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేసి, బడ్జెట్ ప్రిపరేషన్ పూర్తి చేసి ఆమోదంకు రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక పంపించాలన్నారు. స్థానిక వెలుగు ఏపీఎం శ్రీనివాస్ శిక్షణను వాన్ని విజయవంతంగా పూర్తి చేసారు.

పల్లెలను పరిశుభ్రంగా ఉంచాలి



గొలుగొండలో శుభ్రం చేయిస్తున్న ఎంపిడిఒ

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని జోగంపేట గ్రామంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పరిశుభ్రత కార్యక్రమాన్ని ఎంపిడిఒ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. తగ్రామంలోని ప్రధాన వీధులు, ప్రభుత్వ కార్యాలయాల పరిసరాలను శుభ్రపరిచారు. అనంతరం గ్రీన్ అంబాసిడర్లతో సమావేశమై గ్రామ పరిశుభ్రతపై వివరించారు. పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ వినియోగంపై ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ శ్రీనివాసరావు మాట్లాడుతూ, ప్రతి ఇంటి నుండి ప్రారంభమయ్యే పరిశుభ్రతే గ్రామ అభివృద్ధికి పునాది అన్నారు. తడి చెత్త, పొడి చెత్తను వేరు చేయడం ద్వారా పర్యావరణ కాలుష్యం తగ్గుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సిబ్బంది, స్థానికులు పాల్గొని పరిశుభ్రతపై తమ సహకారం అందించారు.

కోటవురట్ల: పరిశుభ్రతతోనే ఆరోగ్యం చేకూరుతుందని మండల టిడిపి అధ్యక్షులు, బికెపల్లి గ్రామ సర్పంచ్ లింగన్న నాయుడు అన్నారు. శుక్రవారం ఎంపిడిఒ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో బికెపల్లిలో పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్, ఎంపిడిఒలు స్వయంగా కాలువలు శుభ్రం చేశారు, ఇఒపిఆర్‌డి కూర్మారావు, గ్రామ కార్యదర్శి రఘురాం పాల్గొన్నారు.

సబ్బవరం : మండలంలోని గుల్లేపల్లి గ్రామంలో క్లీన్అండ్ గ్రీన్ నిర్వహించారు. స్థానిక ఎంపిపి బోకం సూర్యకుమారి మాట్లాడుతూ గ్రామాల్లో చెత్త, చెదారం లేకుండా ప్రతిఒక్కరు బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బండారు మంగ శ్రీను, ఎంపిడిఒ, డిప్యూటీ ఎంపిడిఒ పాల్గొన్నారు.

రోలుగుంట:మండలంలోని కొవ్వూరు గ్రామంలో శుక్రవారం ప్రత్యేక పారిశుద్య కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ నాగేశ్వరరావు క్లాప్ మిత్రలకు అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కరపత్రాలు పంపిణీ చేసి మైక్ ద్వారా ప్రచారం చేశారు. పరిశుభ్రత, వ్యర్థాల నిర్వహణ, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం, మొక్కలను నాటడం, నీటి సంరక్షణ వంటి అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ దుర్గాప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



రోలుగుంటలో అవగాహన కల్పిస్తున్న ఎంపిడిఒ



మాట్లాడుతున్న ఎంపిడిఒ

తడి, పొడి చెత్తలపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి -నాతవరం: మండలంలోని మర్రిపాలెం గ్రామంలో ఎంపిడిఒ ఎం.ఎస్.శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం క్లాప్ మిత్రలకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ, చెత్త సేకరించడంలో తడి, పొడి వ్యర్థాల నిర్వహణపై అవగాహన కల్పించారు. అనంతరం క్లాప్ మిత్రలతో కలిసి పాఠశాలలు, వీధులతో పాటు ప్రభుత్వ భవనాల వద్ద శుభ్రం చేయించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ కె.మూర్తిబాబు, పంచాయతీ కార్యదర్శులు, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు నందిపల్లి వెంకటరమణ, సర్పంచ్ రమణమ్మ, సాంబమూర్తి, గవిరెడ్డి త్రినాథ్ పాల్గొన్నారు.

భారీ అన్న సమారాధన

ప్రజాశక్తి -నాతవరం: మండలంలోని చమ్మచింత లోని నల్లగొండ తల్లి అమ్మవారి ఆలయ 15వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భారీగా మహిళలు పాల్గొన్నారు. అనంతరం భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

అవంతి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి -నర్సీపట్నం:మాకవరపాలెం మండలంలోని అవంతి ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో శుక్రవారం కర్నూరుపాలెం గ్రామంలో రక్తదాన, వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ మోహనరావు తెలిపారు. గడిచిన వారం రోజులుగా ప్రత్యేక వైద్యంతో వివిధ వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు, ఈ రక్తదాన శిబిరంలో 32 మంది పాల్గొన్నట్లు తెలిపారు.



మైదానంలో ఏర్పాట్లు చేస్తున్న ఎస్‌జిఎఫ్ సభ్యులు

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఏర్పాట్లు

ప్రజాశక్తి -నక్కపల్లి:నక్కపల్లి హాకీ క్రీడా మైదానంలో 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 22 నుండి 24వ తేదీ వరకు బాల బాలికల అండర్ - 19 రాష్ట్ర స్థాయి హాకీ క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్‌జిఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వివి పుష్పలత తెలిపారు. శుక్రవారం ఎస్‌జిఎఫ్ సభ్యులతో కలిసి ఏర్పాట్లను పర్యవేక్షించారు. క్రీడా మైదానంలో చేపట్టాల్సిన ఏర్పాట్లు, క్రీడాకారులకు వసతి సౌకర్యం పరిశీలన చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ జిఎఫ్ సభ్యులు రాంబాబు, ప్రసాద్, సూరిబాబు, తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి గుండె శస్త్ర చికిత్సకు స్పీకర్ అయ్యన్న సాయం

ప్రజాశక్తి - గొలుగొండ (అనకాపల్లి):గొలుగొండ మండలం చీడిగుమ్మల గ్రామానికి చెందిన షేక్ వహీదా బేగం గుండె సమస్యతో బాధపడుతున్న విషయం తెలిసి శాసన సభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సాయం అందించారు. వివరాల్లోకి వెళ్తే.. చిన్నారి గుండెలో రంధ్రం ఉండటం వల్ల ఆపరేషన్‌కు విశాఖపట్నం ఆసుపత్రిలో సుమారు రూ.5 లక్షల వరకూ ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. చిన్నారి కుటుంబానికి అంత స్థోమత లేకపోవడంతో స్థానిక నాయకులు కామిరెడ్డి గోవింద్, షేక్ అజీన్ ఈ విషయాన్ని స్పీకర్ సతీమణి, కౌన్సిలర్ పద్మావతి దృష్టికి తీసుకెళ్లారు. ఆమె వెంటనే ఈ విషయాన్ని స్పీకర్‌కు తెలియజేయడంతో ఆయన వెంటనే స్పందించారు. చిన్నారి వహీదాను తిరుపతిలోని పద్మావతి చిన్నపిల్లల హృదయాలయానికి తక్షణ చికిత్స నిమిత్తం పంపించారు. అక్కడి డాక్టర్లతో స్పీకర్ అయ్యన్నపాత్రుడు స్వయంగా ఫోన్‌లో మాట్లాడి పాపపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఆపరేషన్ విజయవంతం కావడంతో అక్కడి వైద్య సిబ్బంది తగిన మందులతో వహీదాను క్షేమంగా ఇంటికి పంపించారు. కోలుకున్న చిన్నారిని శుక్రవారం కామిరెడ్డి గోవింద్, గ్రామ నాయకులు పరామర్శించారు. తమ బిడ్డకు ప్రాణం పోసి, క్షేమంగా ఇంటికి తీసుకువచ్చినందుకు స్పీకర్ కుటుంబానికి ఎల్లవేళలా రుణపడి ఉంటామంటూ వహీదా కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.



గుండె శస్త్ర చికిత్స విజయవంతమై ఇంటికి చేరుకున్న వహీదా

అదాని అంబుజా సిమెంట్ రద్దుకు నిరసన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పెదగంట్యాడ వద్ద అదాని అంబుజా సిమెంట్ కంపెనీ నిర్మాణ ప్రతిపాదనను రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ శుక్రవారం జివిఎంసి కౌన్సిల్ సమావేశంలో అజెండా పెట్టాలని విజ్ఞప్తి చేస్తూ పెదగంట్యాడ అదాని అంబుజా సిమెంట్ కంపెనీ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో జివిఎంసి ప్రధాన కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. కౌన్సిల్ సమావేశానికి హాజరవుతున్న అన్ని పార్టీల కార్పొరేటర్లకు వినతి పత్రాలను సమర్పించారు. పోరాట కమిటీ కన్వీనర్లు నగిరెడ్డి రామారావు, కసిరెడ్డి సత్యనారాయణ, జి.అచ్చిబాబు, సిపిఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు, ఎస్‌కె.రెహిమాన్, మంత్రి శంకర్ నారాయణ, నమ్మి రమణతో పాటు పలువురు పోరాట కమిటీ నాయకులు వినతిపత్రాలను అందజేసిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా కమిటీ కన్వీనర్లు మాట్లాడుతూ అంబుజా సిమెంట్ ప్యాక్టరీ గాజువాక, పెదగంట్యాడ, మల్కాపురం తదితర ప్రాంతాల్లో నివసించే 10 లక్షల మంది ప్రజలకు తీవ్ర ప్రమాదం చేకూరుస్తుందన్నారు. ఊపిరితిత్తులు, శ్వాసకోశ, గుండె, చర్మ, కంటి, రక్తహీనత, గర్భస్రావం, క్యాన్సర్ వంటి అనేక ప్రాణాపాయ జబ్బులకు గురౌతారన్నారు. నీరు కలుషితమవుతుందన్నారు.



నిరసన చేపడుతున్న పోరాట కమిటీ నాయకులు

26న జిల్లా కేంద్రాల్లో రైతు సంఘాల నిరసనలు

ప్రజాశక్తి-అనకాపల్లి : ఢిల్లీలో రైతు ఉద్యమం జరిగి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా ఈనెల 26న జిల్లా కేంద్రాలలో చేపట్టే నిరసనలు, ప్రదర్శనలు విజయవంతం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా, ట్రేడ్ యూనియన్లు పిలుపునిచ్చాయి. శుక్రవారం స్థానిక దొడ్డి రామునాయుడు కార్మిక కర్షక నిలయంలో దీనికి సంబంధించి వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం అప్పలరాజు, సిఐటియు జిల్లా అధ్యక్షులు వివి శ్రీనివాసరావు మాట్లాడతూ, చారిత్రాత్మక రైతు ఉద్యమ పోరాటంలో 736 మంది అన్నదాతలు అమరులయ్యారని, స్వాతంత్రానంతర భారత చరిత్రలో ఇదే అత్యంత పెద్ద పోరాటమన్నారు. కార్పొరేట్లకు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం తెచ్చిన మూడు నల్ల సాగు చట్టాల రద్దుకు కార్మికవర్గం మద్దతుతో రైతాంగం ఏడాది పాటు పోరాటం సాగించి, కేంద్రం మెడలు వంచారన్నారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ 2021 డిసెంబర్ 9న రైతుసంఘాలకు రాతపూర్వకంగా కేంద్రం ఇచ్చిన హామీని నిలబెట్టుకోకుండా ద్రోహం చేసిందన్నారు. నాటినుం సంయుక్త కిసాన్ మోర్చా పోరాటాల దెబ్బకు గత ఎన్నికలలో బిజెపి సొంత మెజారిటీ కోల్పోయిందన్నారు. మూడోసారి అధికారం చేపట్టిన ఎన్‌డిఎ ప్రభుత్వం మరీ దారుణంగా వ్యవహరిస్తూ, కార్మిక, కర్షకులతోపాటు అన్ని వర్గాల ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తూ కార్పొరేట్లకుఅనుకూలమైన చట్టాలను చేస్తూ రెడ్‌కార్పెట్ వేస్తోందని మండిపడ్డారు. విద్యుత్ రంగాన్ని ప్రైవేటుపరం చేయాలని చూస్తోందన్నారు. తగిన నష్టపరిహారం ఇవ్వకుండా కార్పొరేట్ల కోసం భూ సేకరణకు పూనుకుంటుందన్నారు. ఈ ఏడాది ఎరువుల కొరత, బ్లాక్ మార్కెటింగ్, పంటలను కనీస మద్దతు ధరలు కూడా లేకపోవడం, ప్రకృతి వైపరీత్యాలు రైతాంగాన్ని మరింత కుంగదీశాయని, ఈ నేపథ్యంలో బాధితులకు నష్టపరిహారం, పంటల బీమా నామమాత్రమయ్యాయని ఆరోపించారు. ఉపాధి హామీకి నిధులు కోత, వ్యవసాయ రాయితీల్లో కోత పెట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో సంయుక్త కిసాన్ మోర్చా, ట్రేడ్ యూనియన్ యాక్షన్ కమిటీ, వ్యవసాయ కార్మిక సంఘాల ఐక్యవేదిక పిలుపుమేరకు ఈనెల 26న దేశవ్యాప్తంగా అన్ని జిల్లాలలో సామూహిక నిరసన ప్రదర్శనలు చేపట్టాలని నిర్ణయించిన నేపథ్యంలో వాటిని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, కోశాధికారి గండి నాయన బాబు, సిఐటియు జిల్లా నాయకులు గంటా శ్రీరామ్, ఎం రాజేష్, కే తేలయ్య బాబు, నాగిరెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.



వివరాలను వెల్లడిస్తున్న సంయుక్త కిసాన్ మోర్చా, ట్రేడ్ యూనియన్ నేతలు

సిఐటియు జాతీయ మహాసభలను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి- కె. కోటపాడు : విశాఖపట్నంలో వచ్చేనెల 31 నుంచి జనవరి 4 వరకు జరిగే సిఐటియు అఖిలభారత మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు మండల కార్యదర్శి గండి నాయనబాబు కోరారు. శుక్రవారం అనందపురంలో ఆటో, ముఠా కార్మికులతో సమావేశమై మాట్లాడుతూ కార్మికులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి, హక్కుల పరిరక్షణకు పోరాటంలో దేశవ్యాప్తంగా గుర్తింపులో సిఐటియు ముందు వరుసలో ఉందన్నారు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై జాతీయ మహాసభల్లో చర్చించి, భవిష్యత్ పోరాట కార్యాచరణ రూపొందిస్తారన్నారు. సిఐటియు జాతీయ మహాసభల్లో భాగంగా జనవరి 4న నిర్వహించే బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. అధికసంఖ్యలో కార్మికులు హాజరై మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి రంగం ముత్యాలనాయుడు, నాయకులు ఈర్ల నాయుడుబాబు పాల్గొన్నారు.



ఆటో, ముఠా కార్మికులతో మాట్లాడుతున్న నాయనబాబు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ ఉషారాణి

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు గురుకుల విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి -నక్కపల్లి:రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు నక్కపల్లి గురుకులం విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ ఉషారాణి తెలిపారు. ఇటీవల జరిగిన జిల్లా స్థాయి హాకీ పోటీల్లో గురుకులం విద్యార్థులు పాల్గొని, ప్రతిభ కనబరచడంతో జిల్లా స్థాయికి ఎంపికైనట్లు వెల్లడించారు.అండర్ -19 విభాగంలో ఎంపికైన విద్యార్థులు పి.మేఘనాంజలి, బి.కృప ఈనెల 22 నుండి నక్కపల్లిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని, అండర్ - 14 విభాగంలో ఎంపికైన విద్యార్థులు పి ప్రసన్న కుమారి, కె అస్మితశ్రీ తిరుపతిలో జరిగే పోటీల్లోనూ, అండర్ -17 విభాగంలో ఎంపికైన విద్యార్థులు ఎస్ లాస్యకుమారి, కె శాంతి బ్యూలరాణి, జె.విద్యా వాసినికుసుమలు డిసెంబర్ 3 నుండి నెల్లూరులో జరిగే రాష్ట్ర స్థాయి హాకీ పోటీలో పాల్గొంటారని తెలిపారు. పల్నాడు జిల్లా వినుకొండ లో ఇటీవల జరిగిన అండర్- 19 రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో పి.దుర్గా భవాని మూడవ స్థానం కైవసం చేసుకుందన్నారు. ఈ మేరకు ప్రిన్సిపల్ ఉషారాణి, పీఈటీలు, ఉపాధ్యాయులు ఎంపికైన విద్యార్థులను అభినందించారు.



మాట్లాడుతున్న సామాజిక కార్యకరత మంగ

పాఠశాలలో రక్షణ కమిటీ సమావేశం

ప్రజాశక్తి-చీడికాడ:జిల్లా మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల సంరక్షణ విభాగం ఆధ్వర్యంలో మండలం కేంద్రంలోని సచివాలయం లో విలేజ్ లెవెల్ చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సామాజిక కార్యకర్త పి.మంగ మాట్లాడుతూ, కమిటీ సభ్యుల బాధ్యతలు వివరించారు. చైల్డ్ మ్యారేజ్ యాక్ట్, బాల్య వివాహం చేస్తే వచ్చే శారీరక, మానసిక సమస్యలు, బాలలపై లైంగిక వేధింపులను వివరించారు.పోక్సో యాక్ట్, సోషల్ మీడియా, డ్రగ్స్, దత్తత (అడాప్షన్) డిసిపియు యూనిట్ సర్వీసెస్‌ను తెలిపారు. బాల బాలికులకు ఎటువంటి సమస్యలు వచ్చినా రక్షణ కమిటీకి తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడుతో పాటు, మహిళా పోలీస్, అంగన్వాడీ టీచర్స్ పాల్గొన్నారు.



పంపిణీ చేస్తున్న సత్యసాయి సేవా కార్యకర్తలు

రోగులకు పాలు, రొట్టెల పంపిణీ

ప్రజాశక్తి -నక్కపల్లి:భగవాన్ సత్య సాయి బాబా శత జయంతి వేడుకల్లో భాగంగా ఆధ్వర్యంలో శుక్రవారం నక్కపల్లి 50 పడకల ఆసుపత్రిలో రోగులకు పాలు, రొట్టె పంపిణీ చేశారు. శత జయంతి వేడుకల్లో భాగంగా నగర సంకీర్తన, భజన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భగవాన్ సత్యసాయి సేవా కార్యకర్తలు కొత్త భగవాన్, శ్రీపాద ప్రసాద్, కొత్త రాము, సత్తికొండ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.